

పత్తికి దక్కని 'మద్దతు'

- క్వింటాలుకు రూ.7వేలు పలకని ధర
- పెద్ద ఎత్తున నష్టపోతున్న రైతులు
- తేమ సాకుతో కొనుగోళ్లకు సీసీఐ దూరం

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలో పత్తి కొనుగోళ్లు ప్రారంభమై వారం రోజులు దాటుతున్నా రైతులకు మద్దతు ధరలు దక్కడం లేదు. క్వింటాలు పత్తి ధర ఇప్పటివరకు 7 వేల రూపాయలకు కూడా చేరుకోలేదు. క్వింటాలు పత్తికి 700 నుంచి వెయ్యి రూపాయలకు పైగా రైతులు నష్టపోతున్నారు. అధిక వర్షాల కారణంగా ఆశించిన మేరకు దిగుబడులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు మద్దతు ధర దక్కక మరింత కుంగిపోతున్నారు. రైతులకు మద్దతు ధరలు దక్కనప్పుడు రంగంలోకి దిగాల్సిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) దూరంగా ఉంటున్నది. శుక్రవారం పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డుకు 240 మంది రైతులు 635 సంచుల్లో 571.50 క్వింటాళ్ల పత్తిని మార్కెట్‌కు తీసుకరాగా గరిష్ఠంగా 6,810 రూపాయలు, కనిష్ఠంగా 6,200 రూపాయలు, మోడల్ ధర 6,600 రూపాయలు పలికింది. ఈ ధరల్లో పెద్దగా వ్యత్యాసం ఉండడం లేదు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు 7,521 రూపాయలు కాగా, కనీసం 7 వేల ధర కూడా వ్యాపారులు పెట్టడం లేదని రైతులు తెలిపారు.



పెద్దపల్లి మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లు(ఫైల్)

● జిల్లాలో 52,887 ఎకరాల్లో సాగు..

జిల్లాలో పత్తి పంట సాధారణ సాగు 67,791 ఎకరాలు కాగా, ఈ సీజన్‌లో 52,887 ఎకరాల్లో పత్తి పంటను రైతులు పండిస్తున్నారు. గత ఏడాది 62,750 ఎకరాల్లో పత్తి పండించగా, ఈ ఏడాది 9,863 ఎకరాల్లో పత్తి పంటకు బదులు ఇతర పంటలను సాగు చేశారు. ఈ సీజన్‌లో సాగైన పత్తి పంట ద్వారా 4 లక్షల 71 క్వింటాళ్ల దిగుబడులు వస్తాయని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖాధికారులు అంచనా వేశారు. కానీ సాధారణానికి మించి కొడుతున్న వర్షాలు, వివిధ రకాల తెగుళ్ల కారణంగా పత్తిలో దిగుబడులు ఆశించిన మేరకు వచ్చే అవకాశాలు లేవని రైతులు చెబుతున్నారు. పత్తి కాపునకు వచ్చిన దశలో వర్షాలు పడుతుండడంతో పత్తి కాయలు పగిలిన దూది తడిసి నల్లగా మారుతున్నది. ఈ కారణంగా కూడా రైతులు నష్ట పోతున్నారు. ప్రస్తుత సమయంలో తేమ శాతం 15 వరకు వస్తున్నప్పటికీ, ఆ సాకుతో సీసీఐ మద్దతు ధరలకు పత్తిని కొనుగోలు చేసేందుకు ముందుకు రావడం లేదు. 8 నుంచి 12 శాతం వరకు తేమ ఉన్న పత్తినే కొనుగోలు చేస్తామని సీసీఐ అధికారులు చెబుతున్నారు. మార్కెట్‌లో అడ్తి వ్యాపారులు తేమ శాతాన్ని పరిశీలించి ధర పెడుతున్నారు. తేమ శాతం 20 వరకు వస్తున్నదని, ఆ కారణంగానే ధర రావడం లేదని మార్కెటింగ్ శాఖాధికారులు చెబుతున్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది పత్తి ధర 901 రూపాయల నుంచి 1041 రూపాయల వరకు పెరగడం గమనార్హం.

● తక్కువ ధరకే విక్రయాలు..

జిల్లాలో పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌తో పాటు పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ పరిధిలో గల రెండు జిన్నింగ్ మిల్లుల్లో, సుల్తానాబాద్ మార్కెట్ పరిధిలోని ఒక మిల్, కమాన్‌పూర్ మార్కెట్ పరిధిలోని ఒక జిన్నింగ్ మిల్ వద్ద పత్తిని కొనుగోలు చేస్తున్నారు. సీసీఐ అధికారులు కూడా అక్కడే పత్తిని కొనుగోలు చేయనున్నారు. మార్కెట్‌లో నేరుగా కాంటాలు పెట్టి కొనుగోలు చేయడం లేదు. కొనుగోలు చేసిన పత్తిని జిన్నింగ్ మిల్లుకు తరలించేందుకు రవాణా ఖర్చులు భారంగా మారాయని, జిన్నింగ్ మిల్లు పాయింట్ వద్దనే కొనుగోలు చేయాలని నిర్ణయించారు. మార్కెట్‌లో పత్తికి వ్యాపారులు మద్దతు ధరలు పెట్టనప్పుడు, అదే మార్కెట్‌లో సీసీఐ అధికారులు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. కానీ అలా చేయడం లేదు. దీంతో రైతులు విధి లేక తక్కువ ధరకే విక్రయిస్తున్నారు. గత ఏడాది కంటే

(మిగతా 8వ పేజీలో..)

న్యూస్ బాక్స్

ఖని జనరల్ ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో జంగ సంజయ్ అనే యువకునికి వైద్యులు అరుదైన శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. గోదావరిఖనికి చెందిన సంజయ్ అనే యువకుడు 15రోజుల క్రితం ముఖం, కంటిపై తీవ్రగాయాలు కాగా ప్రైవేట్ ఆసుపత్రికి వెళితే సుమారు రూ.లక్ష ఖర్చు అవుతాయని వైద్యులు చెప్పడంతో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేరారు. కంటికి అరుదైన ఆపరేషన్ చేయడంతో పాటు దంత వైద్యులు ఆర్బిటల్ ఫ్లోర్, ఎడమ ఆర్బిటాల్ రిమ్, ఎడమ జైకోమటిక్, మెక్సిల్లరీ ఎముకలకు ఉన్న పగుళ్లను ఓపెన్ రిడక్షన్, ఇంటర్నల్ ఫిక్సషన్ అనే శస్త్రచికిత్స చేశారు. ఉస్మానియా హాస్పిటల్ తరువాత గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఈ శస్త్ర చికిత్సను విజయవంతం చేసిన వైద్యులను ప్రిన్సిపాల్ హిమబిందు అభినందించారు.

28 నుంచి ఓపెన్ డిగ్రీ రెండవ సెమిస్టర్ పరీక్షలు

కోల్‌సిటీటౌన్, అక్టోబర్ 25: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్‌సీ ప్రథమ సంవత్సరం 2023లో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు రెండవ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 28వ తేది నుంచి నవంబర్ 4వ తేది వరకు జరుగుతాయని స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ జీ.సుబ్బారావు, గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జై కిషన్ ఓజా ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరిగే పరీక్షలకు హాల్ టికెట్స్ ఆన్‌లైన్ ద్వారా తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఈనెల 30వ తేది అని, ఎలాటి అపరాధ రుసుము లేకుండా పొడిగించబడినట్టు తెలిపారు.

1న ప్రజాభిప్రాయ సేకరణ

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో వెనుకబాటుతనంపై నవంబర్ 1న ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నామని, దీనిలో అన్ని వర్గాలకు చెందిన ప్రజలు, మేధావులు హాజరై వారి అభిప్రాయాలను తెలియజేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం నవంబర్ 1న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియం హాల్‌లో ఉమ్మడి జిల్లా ప్రజల అభిప్రాయాలు తెలుసుకునేందుకు ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు, మేధావులు కుల సంఘాలు, సంచార జాతుల ప్రతినిధులు హాజరై తమ అభిప్రాయాలు తెలియజేయాలని, ప్రతి ఒక్కరు తమ అభిప్రాయాలను, అభ్యర్థనలను రాతపూర్వకంగా వెరిఫికేషన్ అఫిడవిట్‌తో పాటు 6 సెట్లలో తెలుగు లేదా ఆంగ్లం ఏదైనా భాషలో తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్‌కు సమర్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

నేడు మెరిట్ జాబితా ప్రదర్శన

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో మెరిట్ జాబితా ప్రదర్శిస్తున్నట్లు డీఎంహెచ్‌వో ప్రమోద్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలో జాతీయ ఆరోగ్యమిషన్ కింద ఆయుష్ విభాగంలో ఖాళీగా ఉన్న ఆయుష్ వైద్యాధికారి 1, ఫార్మసిస్ట్ 6, స్వీపర్ కమ్ నర్సింగ్ 2 పోస్టుల ఉద్యోగ ప్రకటనకు సంబంధించిన ఫైనల్ మెరిట్ జాబితాను శనివారంఉదయం 11 గంటలకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో నోటీస్‌బోర్డుపై ప్రదర్శించనున్నట్లు తెలిపారు. జాబితాలో అభ్యంతరాలున్న వారు శనివారం నుంచి ఈనెల 28 సాయంత్రం 5గంటలలోపు పరిష్కరించుకోవాలని సూచించారు.

పెద్దపల్లి జిల్లా మత్స్యశాఖ అధికారి బదిలీ

పెద్దపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా మత్స్యశాఖ అధికారి జరుపుల భాస్కర్ నాయక్ ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఇటీవల జిల్లాలో జరిగిన ఉచిత చేప పిల్లల పంపిణీలో నాసిరకం చేపలు పంపిణీ కాడంపై జిల్లావ్యాప్తంగా మత్స్యకారులు, ఫిషరీస్ సొసైటీలు ఆయనపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేశాయి. నాసిరకం చేప పిల్లలను పంపిణీ చేసిన కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేసినా బదిలీ తప్పలేదు. ఆయన స్థానంలో సుల్తానాబాద్ ఎఫ్‌డీవో నరేశ్‌కుమార్‌నాయుడుకు జిల్లా మత్స్య అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



పనులను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మారం (పెద్దపల్లి రూరల్), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, సకల సదుపాయాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని నందిమేడారం బాలుర గురుకుల పాఠశాలలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు సదానందం స్వంత ఖర్చులతో చేపడుతున్న శానిటేషన్ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సదానందంను ప్రభుత్వవిప్ అభినందించారు. పాఠశాల యజమాన్యం కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. విద్యార్థుల వసతి విషయంలో ఎటువంటి ఇబ్బంది ఉన్నా తన దృష్టికి తీసుకురాలవాని, విద్యారంగం విషయంలో ప్రభుత్వం ఎక్కడా రాజీపడే ప్రసక్తి లేదన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యజమాన్యం, కాంగ్రెస్ మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహా సమ్మేళనం కరపత్రాలు ఆవిష్కరణ

పెద్దపల్లిటౌన్ అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) ధర్మ సమాజ్ పార్టీ మహా సమ్మేళనం కర పత్రాలను శుక్రవారం రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ మహారాజ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు ఈ సందర్భంగా శ్రీకాంత్ మహారాజ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్య, వైద్యం, భూమి, ఇల్లు, ఉపాధి అవకాశాలను కల్పించాలని, 5 అంశాల పైన ధర్మ సమాజ్ పార్టీ ధర్మ యుద్ధం చేయబోతుందన్నారు. అలాగే నవంబర్ 3న హైదరాబాద్‌లో జరిగే ధర్మ సమాజ్ పార్టీ కార్యకర్తల మహా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కన్వీనర్ కనకం గణేష్ న్యతరి శ్రీనివాస్ జిల్లా ఏదుల్ల శంకరయ్య ఆవునూరి సతీష్ , మంతెన రమేష్, క్యాదసి రమేష్, కృష్ణ, రాజు, ప్రవీణ్, అవినాష్, నగేష్, విక్రమ్ రేవంత్, ముకేష్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో వాటర్ ప్లాంట్ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరెపల్లి గ్రామంలో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సొంత ఖర్చులతో ఏర్పాటు చేయనున్న వాటర్ ప్లాంట్‌కు శుక్రవారం భూమి పూజ చేశారు. వాటర్ ప్లాంట్ త్వరలో నిర్మించి గ్రామస్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తానని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం అదే గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయం చుట్టూ ఐదు లక్షలతో నిర్మించనున్న ప్రహరీ నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేశారు. సొంత ఖర్చులతో వాటర్ ప్లాంట్ నెలకొల్పేందుకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యేను మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్‌లను గ్రామస్థులు సన్మానించారు. మాజీ సర్పంచ్ పోన్నమనేని దేవేంద్ర రావు, మాజీ ఎంపీటీసీ రావి సదానందం పాల్గొన్నారు.

గ్రంథాలయ సంస్థ చైర్మన్‌కు సన్మానం

సుల్తానాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమితులైన అంతటి అన్నయ్యగౌడ్‌ను శుక్రవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తంగెళ్లపల్లి రాజ్‌కుమార్ తదితరులు సన్మానించారు. గర్రెపల్లి మాజీ సర్పంచ్ సత్యనారాయణ రావు, సింగిల్ విండో మాజీ చైర్మన్ కల్లెపల్లి జానీ ఉన్నారు. అలాగే గర్రెపల్లి గౌడ సంఘం నాయకులు మాజీ ఎంపీటీసీ పులి వెంకటేశం తదితరులు, రామగుండానికి చెందిన పలువురు మున్సిపల్ కార్పొరేటర్లు అన్నయ్యగౌడ్‌ను కలిసి సన్మానించారు పెద్దపల్లి కరీంనగర్ జిల్లాలకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.



కొలనూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

రైతులను ఇబ్బంది పెడితే ఎవరినీ ఉపేక్షించం

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

8



మాట్లాడుతున్న గొట్టెముక్కుల సురేష్‌రెడ్డి

సభ్యత్వ నమోదుకు స్పెషల్ డ్రైవ్

- బీజేపీ నియోజకవర్గ ప్రవాసి గొట్టెముక్కుల సురేష్‌రెడ్డి

8

అర్హులందరికీ రైతు భరోసా వర్తింపచేస్తాం

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



జయ్యారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్ సింగ్

పాలకుర్తి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హులైన ప్రతి రైతుకు రైతు భరోసాను కచ్చితంగా అందించి తీరుతామని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్‌సింగ్ అన్నారు. శుక్రవారం మండలం పరిధిలోని జయ్యారం, పుట్నూర్ గ్రామాల్లో మేడిపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో ఎర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సంద్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి పలు పథకాలకు రూపకల్పన చేసి అమలుచేస్తోందన్నారు. రైతులకు ప్రయోజనం కల్పించేందుకే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి క్వింటాలుకు 2,320 రూపాయల మద్దతు ధరను చెల్లిస్తున్నామన్నారు. రైతులు దుమ్ము,ధూళి లేకుండా ఆరబెట్టిన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. గత ప్రభుత్వం గుట్టలు, పుట్టలు, సాగుకు నోచుకోని భూములకు సైతం రైతు బంధు చెల్లించి రాష్ట్ర ఖజానాకు తూట్లు పొడిచిందన్నారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి సహకార సంఘం చైర్మన్ మామిడాల ప్రభాకర్, సీఈవో వైద్య రమేష్, మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్ గౌడ్, కన్నాల పీఏసీఎస్ చైర్మన్ బయ్యపు మనోహర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ గౌడ్, స్థానిక ఎంపీడీవో పొల్సాని శశికళ, తహసీల్దార్ ఎం జ్యోతి, మండల వ్యవసాయ శాఖ అధికారి బండి ప్రమోద్ కుమార్, మాజీ సర్పంచ్‌లు మల్లెత్తుల శ్రీనివాస్, పర్శవేణి శ్రీనివాస్ యాదవ్, నాయకులు నార సత్తయ్య, కొప్పు ప్రసాద్, మేడం బాపు తదితరులతో పాటు పలు గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

నాణ్యతతో పనులు చేపట్టాలి..

కోల్‌సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని టీయూఎఫ్ఐ డీసీ, ఇతర స్కీములతో జరుగుతున్న పనుల్లో నాణ్యతలో రాజీ పడవద్దని, నాణ్యతతో అభివృద్ధి పనులు చేపట్టాలని రామగుండం ఇన్‌చార్జి కమిషనర్, అదనపు కలెక్టర్ అరుణశ్రీ ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆమె తనిఖీ చేశారు. టీయూఎఫ్ఐడీసీ నిధులతో 21వ డివిజన్‌లో జరుగుతున్న రోడ్డు, మురుగునీటి కాలువలు, వంతెన నిర్మాణ పనులను పరిశీలించారు. అలాగే ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్డు నుంచి ఆర్ఎఫ్‌సీ ఎల్ వరకు డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులను పరిశీలిం చారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు, ఇంజనీర్లకు పలు సూచనలు చేశారు. పనులు జరుగుతునప్పుడు వర్క్ ఇన్‌స్పెక్టర్లు, అధికారులు క్షేత్రస్థాయిలో ఉండాలని, కాంట్రాక్టర్లు నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం పనులు చేయాల ని ఆదేశించారు. క్వాలిటీ కంట్రోల్ ఏజెన్సీలు కూడా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపాలని ఆమె ఆదేశించారు. అడిషనల్ కలెక్టర్ వెంట సెక్రటరీ రాజు, ఎస్ఈ శివానంద్, ఈఈ రామన్, డీఈ జమీల్, ఏఈ వీర్, హెల్త్ అసిస్టెంట్ సునీల్ రాథోడ్ ఉన్నారు.



సెంట్రల్ లైటింగ్ పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

రామగుండంలో రూ.33.9లక్షలతో కొత్త వీధి దీపాలు

కోల్‌సిటీ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థలో వీధి దీపాల కొరత లేకుండా రూ.33.9లక్షల వ్యయంతో కొత్త వీధి దీపాలు కొనుగోలు చేసినట్టు అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 20 వాట్ల 940లైట్లు, 45వాట్ల 215లైట్లు, 70వాట్ల 114లైట్లు, 90 వాట్ల 30లైట్లు కొనుగోలు చేసినట్టు తెలిపారు. 1300కొత్త వీధి దీపాలను 15 నుంచి 30రోజుల్లో అమర్చేందుకు ఏర్పాటుచేశామన్నారు. నగరంలో కొత్తగా 1219 విద్యుత్ స్తంభాలు అవసరమని అంచనా వేయగా 677స్తంభాలు ఇప్పటి వరకు వేయడం జరిగిందన్నారు. మిగిలిన 542 స్తంభాలు రాబోయే నెలరోజుల్లో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. 2,6,20,26,29,32,38,40,47 డివిజన్లలో కొత్త స్తంభాలు వేసి వీధి దీపాలు ఏర్పాటు చేసే ప్రక్రియ పూర్తయ్యిందని, మిగిలిన డివిజన్లలో త్వరలోనే పూర్తిచేస్తామన్నారు. రూ.20లక్షలతో వీధిలైట్ల విడిభాగాలు కూడా తెప్పించి మరమ్మతులు చేయిస్తున్నట్టు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు..

- ప్రమాదాల నివారణకు శాఖలు సమన్వయంతో పని చేయాలి...

- రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్

కోల్‌సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజోతి) : రామగుండం కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని సీపీ శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కమిషనరేట్‌లో పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పరిధిలోని పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, రవాణాశాఖ, నేషనల్ హైవేఅథారిటీ, ఆరోగ్యశాఖ ఆర్‌అండ్‌బీ, ఆర్‌టీసీ తదితర విభాగాల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత అత్యంత ప్రాధాన్యమైనదని, మానవ తప్పిదాల వల్ల అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. 18నుంచి 45సంవత్సరాలలోపు వారే ఎక్కువగా చనిపోతున్నారని, వీటిని నివారించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. నేషనల్ హైవే 63, 363, స్టేట్ హైవే 01, 155, 24, 15, ఇతర రహదారులపై పోలీస్ శాఖ ద్వారా బ్లాక్ స్పాట్‌లను గుర్తించామని, వీటిని ఆర్‌అండ్‌బీ, నేషనల్ హైవే అథారిటీ, మున్సిపల్ తదితర విభాగాల అధికారులతో కలిసి బ్లాక్ స్పాట్‌లను పరిశీలించాలన్నారు. ప్రమాదాలకు కారణాలను గుర్తించి నివారణ పరిష్కారాలు చేపట్టాలన్నారు. రేడియం స్టిక్కర్లతో కూడిన సూచికలను ఏర్పాటు చేయాలన్నారు. రహదారులపై అవసరమైన చోట వాహన వేగాన్ని తగ్గించే స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలన్నారు. కెమెరాలు, లైట్లు, స్పీడ్ కెమెరాలు ఏర్పాటు చేయాలని, జంక్షన్ల వద్ద పాదచారులు దాటే ప్రాంతాల్లో జీబ్రా క్రాసింగ్, లైటింగ్, రోడ్ రిఫ్లెక్టింగ్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. వాహనం ఎంత వేగంతో వెళుతున్నది వాహన చోదకుడికి తెలిసేలా వేగాన్ని సూచించే డిజిటల్ బోర్డులను కూడా ఏర్పాటు చేయాలన్నారు. సర్వీస్ రోడ్లు వేసేందుకు ప్రతిపాదన సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో పెద్దపల్లి డీసీపీ చేతన, అదనపు కలెక్టర్లు అరుణశ్రీ, శ్యాంప్రసాద్‌లాల్, అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, జిల్లా రవాణాధికారి రంగారావు, ఎంవీఐ శ్రీనివాస్, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్ర రావు, గోదావరిఖని, పెద్దపల్లి, మంచిర్యాల, జైపూర్, బెల్లంపల్లి ఏసీపీలు రమేష్, జీ కృష్ణ, ఆర్ ప్రకాష్, వెంకటేశ్వర్లు, రవికుమార్, ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, సీసీఎస్ ఏసీపీ వెంకటస్వామి, ఏఆర్ ఏసీపీలు ప్రతాప్, సుందర్‌రావు, డీఎంహెచ్ఓ ప్రమోద్ కుమార్, పంచాయితీరాజ్ ఈఈ గిరీష్‌బాబు, ఆర్‌అండ్‌బీ డీఈ లింగరాజు, టెక్నికల్ ఆఫీసర్ బాలకృష్ణ, హెచ్‌కేఆర్ మేనేజర్ రామకృష్ణ, రామగుండం డిప్యూటీ కమిషనర్ రాజు, పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

క్రైం కార్నర్

సైబర్‌క్రైం కేసులో ఇద్దరు గుజరాతీల అరెస్టు

- పెట్టుబడి పేరుతో 33.63 లక్షలు కొల్లగొట్టిన నిందితులు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సైబర్ క్రైం కేసులో గుజరాత్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు నిందితులను కరీంనగర్ సైబర్ క్రైం ఏసీపీ వి నర్సింహారెడ్డి అరెస్టు చేశారు. డిప్యూటీ ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్‌కు చెందిన పచ్చునూరు సురేందర్ మొబైల్ ఫోన్‌కు టెలిగ్రాం యాప్, వాట్సాప్ ద్వారా 2023 సెప్టెంబరు 21 అహ్మద్‌ఖాన్ అనే వ్యక్తి ఒక లింక్ పంపించాడు. బంగారం, ఎక్స్‌ఆర్‌పీలలో పెట్టుబడి పెడితే త్వరగా డబ్బులు రెట్టింపు అవుతాయని వాట్సాప్ చాటింగ్ ద్వారా నమ్మబలికాడు. దీనిని నమ్మిన సురేందర్ 2023 నవంబరు 2 నుంచి 2024 జూలై 2 వరకు 33 లక్షల 63 వేల రూపాయలు అహ్మద్‌ఖాన్ పంపించిన ఎస్‌బీఐ, ఇండియన్ బ్యాంక్ ఖాతాల్లో 30 లావాదేవీల్లో జమ చేశాడు. ఆ తరువాత అహ్మద్‌ఖాన్ తన బ్యాంక్ ఖాతా ఫ్రీజింగ్ ఆప్షన్‌ను విత్‌డ్రా చేసుకుని మోసానికి పాల్పడ్డాడు. ఈ మేరకు బాధితుడు కరీంనగర్ సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసిన కరీంనగర్ సైబర్ క్రైం పోలీసులు విచారణ జరిపి సైబర్ మోసంలో ఏడుగురు నిందితుల ప్రమేయం ఉన్నట్లు నిర్ధారించారు. ప్రధాన నిందితుడు పరారీలో ఉండగా గుజరాత్‌కు చెందిన నిందితులు ఇద్దరు షేక్ అఫ్తాబ్, దివాన్ మురాద్‌షాను గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఈ నెల 23న అరెస్టు చేసి అక్కడి కోర్టులో హాజరుపరిచారు. అనంతరం ఇద్దరు నిందితులను ట్రాన్సిట్ వారెంట్‌పై కరీంనగర్‌కు తీసుకువచ్చి కోర్టులో హాజరుపరిచారు. నిందితులు తెలంగాణ, మహారాష్ట్రలో ఇదే విధమైన పలు సైబర్ నేరాలకు పాల్పడినట్లు సైబర్ పోలీసుల విచారణలో వెల్లడైంది. కాగా సైబర్ నేరగాళ్ల అరెస్టులో కీలకంగా పనిచేసిన కరీంనగర్ సైబర్ క్రైం రాణా డిప్యూటీ ఏఎస్పీ వి నర్సింహారెడ్డిని టీజీసీ ఎస్‌బీ డైరెక్టర్ అభినందించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవపూర్ గ్రామానికి చెందిన వినయ్(23) విద్యుదాఘాతంతో మృతిచెందాడు. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వినయ్ రాఘవపూర్ ఇటుక బట్టీల ప్రాంతంలో విద్యుత్ మరమ్మతు పనులు చేపడుతుండగా షాక్ తగలడంతో స్పృహ తప్పి పడిపోయాడు. పెద్దపల్లి ఆసుపత్రికి తీసుకురాగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు పేర్కొన్నారు. ఈ సంఘటనపై ఇంకా ఎలాంటి ఫిర్యాదు రాలేదని బసంత్‌నగర్ ఎస్‌ఐ ఆర్ స్వామి తెలిపారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్ సీజ్

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొంపల్లి గుట్ట నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారనే సమాచారం మేరకు గురువారం రాత్రి మట్టిని తరలిస్తున్నా టిప్పర్‌ను రెవెన్యూ అధికారులు సీజ్ చేసి తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. ఈసందర్భంగా తహసీల్దార్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ అనుమతులు ఉన్నా సమయపాలన పాటించాలని, అక్రమ మట్టి దందాదారులపై చర్యలు తప్పవన్నారు. ఆర్‌ఐ భాను, సిబ్బంది ఉన్నారు.

టెలీఫోన్ క్వార్టర్స్ ప్రాంతంలో దొంగతనం

కరీంనగర్ క్రైం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని టెలీఫోన్ క్వార్టర్స్ ప్రాంతం రోడ్ నంబర్-1లోని జె రఘునందన్‌రావు ఇంటి తాళాలు పగులగొట్టి బంగారం, నగదు, ఇతర విలువైన వస్తువులు అపహరించుకుపోయారని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. రఘునందన్‌రావు ఇటీవలనే ఇంటికి తాళం వేసి కుటుంబంతో అమెరికా వెళ్లాడు. శుక్రవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఇంటి ఆవరణలోకి ప్రవేశించిన ముసుగువేసుకున్న నిందితుడు సీసీకెమెరాను పక్కకు జరిపి. ఇంటితాళలు పగులగొట్టి లోపల బీరువా తెరచి, పడక గదిలోని సామగ్రిని చిందరవందర చేసి విలువైన వస్తువులను ఎత్తుకుపోయాడు. 2 తులాల బంగారం, 10 వేల నగదు, యాపిల్ కంపెనీ వాచ్, టాబ్, ఇతర వస్తువులు చోరీకి గురయ్యాయని బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వేలిముద్రలు సేకరించారు.


తాళం పగులగొట్టిన దుండగుడు

వేర్వేరు చోట్ల తహసీల్దార్ ఎదుట బైండోవర్

మంథని, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గతంలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేసిన పలువురిని మంథని తహసీల్దార్ రాజయ్య ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ రమేష్ శుక్రవారం తెలిపారు. మంథనికి చెందిన రాచర్ల రమేష్, వేముల మహేష్, భీమినేని రాజేష్, బుద్దార్తి సమ్మయ్య, కాసు రాజ్‌కుమార్‌లు ప్రభుత్వానికి చెందిన పీడీఎస్ రైస్ కొని అక్రమంగా గతంలో తరలించారని తెలిపారు. వీరిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు.

ముత్తారంలో నాటు సారా విక్రయదారులు..

ముత్తారం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో నాటుసారా తయారీ, విక్రయదారులను తహసీల్దార్ ఎదుట ఎక్సైజ్ అధికారులు బైండోవర్ చేశారు. అడవి శ్రీరాంపూర్, ముత్తారం, రామకృష్ణాపూర్, మచ్చుపేట, కేశనపల్లి, హరిపురం తదితర గ్రామాల్లో ఎక్సైజ్ పోలీస్ అధికారులు తనిఖీలు నిర్వహించి విక్రయదారులను అరెస్ట్ చేసి తహసీల్దార్ ఎదుట శుక్రవారం బైండో వర్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఏడాది కాలానికి లక్ష రూపాయల పూచీ కత్తుతో బైండోవర్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆబ్కారీ ఎస్‌ఐ సాయి కుమార్, సిబ్బంది రాజేందర్, మహేందర్, రఘు పాల్గొన్నారు.

పోలీస్ విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై కేసు

శంకరపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కేశవ పట్నంలో బ్లూకోల్ట్స్ పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేశవపట్నం గ్రామానికి చెందిన గొల్లెన శ్రీనివాస్ ఈ నెల 24న రాత్రి 9:30గంటలకు తన ఇంటి వద్ద గొడవ జరుగుతుందని డయల్ 100కు కాల్ చేశాడు. డ్యూటీలో ఉన్న బ్లూకోల్ట్స్ సిబ్బంది అక్కడికి వెళ్లి విచారణ చేస్తూ వీడియో చిత్రీకరిస్తున్నారు. ఈ క్రమంలో గొల్లెన శ్రీనివాస్, అతడి అల్లుడు బొజ్జ పవన్ బ్లూకోల్ట్స్ సిబ్బందిని దూషిస్తూ అడ్డుకున్నారు. దీంతో విధులకు ఆటంకం కలిగించి ఇబ్బందులకు గురిచేశారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు గొల్లెన శ్రీనివాస్, బొజ్జ పవన్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

వేలేరు పోలీసుల అదుపులో యువకులు

హుజూరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణానికి చెందిన ఇద్దరు యువకులను హనుమకొండ జిల్లా వేలేరు మండల పోలీసులు శుక్రవారం తెల్లవారు జామున అదుపులోకి తీసుకున్న సంఘటన చోటు చేసుకుంది. హుజూరాబాద్ పట్టణంలోని మారుతిన గర్‌కు చెందిన తేజ(కిట్టు)తో పాటు వెంకటేష్ అనే ఇద్దరు యువకులకు గంజాయి విక్రయదారులతో సంబంధాలు ఉన్నాయని వేలేరు పోలీసులు అరెస్టు చేసి తీసుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. గతంలో వెంకటేష్ గంజాయి విక్రయిస్తూ వరంగల్ జిల్లాలో పట్టుబడ్డాడు. వెంకటేష్ స్నేహితుడు తేజ కావడంతో అతనికి కూడా సంబంధాలు ఉన్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. దీంతో సమగ్ర విచారణకు ఇద్దరు యువకులను మహారాష్ట్ర నంబరు కలిగిన వాహనంలో తీసుకెళ్లడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంపై టౌన్ సీఐ తిరుమ ల్‌గౌడ్‌ను వివరణ కోరగా ఆ ఇద్దరు యువకుల తరలింపుపై ఆరా తీయగా హనుమకొండ జిల్లా వేలేరు పోలీసులు తీసుకెళ్లినట్లు చెప్పారు. ఈ విషయం వారి తల్లిదండ్రులకు వివరించినట్లు తెలిపారు.

ఇసుక లారీల పట్టివేత

కథలాపూర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్ళపల్లి శివారులోని పెద్దవాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు లారీలను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్, తహీల్దార్ వినోద్ తెలిపారు. ఆర్మూర్ నుంచి వచ్చిన లారీలు ఇసుకను తరలిస్తున్నట్లు పక్కా సమాచారం రావడంతో రెవెన్యూ, పోలీసు సిబ్బంది దాడులు చేశారు. గురువారం అర్ధరాత్రి ఇసుకను తోడుతున్నట్లు సమాచారం మేరకు రెండు లారీలపై కేసు నమోదు చేశామని తెలిపారు.

"మార్కెట్లో ఎలక్ట్రిక్ వాహనాలకు క్రేజ్ పెరిగిపోతోంది. పెట్రోల్ ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పాటు ఈజీ డ్రైవ్‌కు ఎలక్ట్రిక్ వాహనాలు అనుకూలంగా ఉండటంతో మహిళలు ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్నారు. సిటీ పరిధిలో ప్రయాణం చేసేవారు ఈ-బైక్స్‌పై ఆసక్తి చూపుతున్నారు. తక్కువ ప్రయాణ ఖర్చుతో పాటు మెయింటనెన్స్ ఖర్చు తక్కువగా ఉండటంతో వాహనాల కొనుగోలు వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ-బైక్స్ మూడు యూనిట్ల కరెంట్‌తో 30 నుంచి 60 కిలోమీటర్ల వరకు ప్రయాణించే అవకాశం ఉంది."


జగిత్యాలలో విక్రయానికి సిద్ధంగా ఉన్న ఈ బైక్స్

ఎలక్ట్రిక్ క్రేజ్

- పెరుగుతున్న ఈ-బైక్స్
- ఆసక్తి చూపుతున్న అన్ని వర్గాల ప్రజలు

జగిత్యాల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్ పెరిగింది. రోజు రోజుకు ఈ-బైక్స్ కొనుగోళ్లు పెరుగుతున్నాయి. కొత్త వాహనాలు కొనుగోలు చేయాలనుకునే చాలా మంది వీటిపై మక్కువ చూపుతున్నారు. జిల్లా కేంద్రమైన జగిత్యాలలోనే కాకుండా ప్రధాన పట్టణాలయిన కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురితో పాటు పలు మండల కేంద్రాల్లో ఎలక్ట్రిక్ బైక్ షోరూంలు వెలిశాయి.

పెరుగుతున్న విక్రయాలు

జగిత్యాల జిల్లాలో సంవత్సరానికి సుమారు పది వేలకు పైగా బైకులు అమ్ముడు పోతున్నాయన్న అంచనా ఉంది. జిల్లాలో ప్రస్తుతం పెట్రోల్‌తో నడిచే బైకులు సుమారు 80 వేల వరకు ఉన్నట్లు అధికారుల రికార్డులు చెబుతుండగా, నిత్యం 40నుంచి 50వరకు వరకు వెహికల్స్ రిజిస్ట్రేషన్ కోసం క్యూ కడుతున్నాయి. ఇప్పటికే జిల్లాలో అయిదు వేలకు పైగా ఈబైక్స్ ఉండగా ఈ మధ్యకాలంలో నెలకు సుమారు 800 నుంచి 1000 వరకు ఎలక్ట్రిక్ వాహనాల విక్రయాలు జరుగుతున్నాయన్న అంచనా ఉంది. గతంతో పోలిస్తే ఎలక్ట్రిక్ వాహనాల సేల్స్ పెరిగాయి.


ఈ-బైక్స్ వినియోగిస్తున్న వాహన చోదకులు

కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ

కాలుష్యాన్ని నియంత్రించి ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచాలనే ఉద్దేశంతో ఇది వరకు కేంద్ర ప్రభుత్వం ఫేమ్ ఇండియా స్కీం వన్, టూ ఫేజ్ కింద కిలో వాట్‌కు రూ. 10 వేల చొప్పున సబ్సిడీలు కూడా అందించింది. దీంతో చాలా మంది ఎలక్ట్రిక్ వెహికల్స్ వైపు మొగ్గు చూపగా, ఇటీవల కాలంలో ఆ ప్రభావం ఇంకాస్త ఎక్కువైంది. రాష్ట్ర ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ సదుపాయం కల్పించడం, ఈ బైక్ 3 యూనిట్ల కరెంట్‌తోనే 30 నుంచి 60 కిలోమీటర్ల వరకు ప్రయాణించే అవకాశం ఉండటంతో చాలామంది ఈ వాహ నాలనే కొనేందుకు మొగ్గు చూపుతున్నారు. కొన్ని కంపెనీలు స్కూటీతో స్పోర్ట్స్ బైక్ మోడ ల్స్‌ను కూడా ఇంట్రడ్యూస్ చేయడంతో మరింత క్రేజ్ వచ్చింది.

ఈ- రిక్షాల వైపు సైతం..

ఎలక్ట్రిక్ బైకుల ఇప్పటికే జనాల్లోకి వెళ్లిపోగా ఆటోలు, కూడా ఇప్పుడిప్పుడే పెరుగుతున్నాయి. జిల్లాలో సుమారు రెండు వేలకు పైగా ఆటో రిక్షాలు ఉండగా, ఈ -రిక్షాలకు కూడా డిమాండ్ పెరుగుతోంది. ఆటోలో8 యూనిట్ల కరెంట్‌తోనే 150 కిలోమీటర్లు పైగా ప్రయాణించే అవకాశం ఉండడంతో చాలామంది డీజిల్ బండ్లను వదిలి ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పుడిప్పుడే ఎలక్ట్రిక్ ఆటోల అమ్మకాలు పెరుగుతుండగా, అన్ని కంపెనీలు కలిసి నెలకు సుమారు పదికి పైగా సేల్ చేస్తున్నట్లు డీలర్స్ చెబుతున్నారు. మున్ముందు ఎలక్ట్రిక్ ఆటోల సేల్స్ మరింత పెరిగే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఈ-బైక్‌ల వినియోగం పెరుగుతున్నాయి...



గతంతో పోలిస్తే ఇటీవలి కాలంలో ఎలక్ట్రిక్ వెహికల్స్ వినియోగం సంఖ్య పెరిగింది. జగిత్యాల పట్టణంతో పాటు పలు ప్రాంతాల్లో నిత్యం వంద వరకు బైక్‌లు అమ్ముడు పోతున్నాయి. రిజిస్ట్రేషన్ అయ్యే వాహనాలకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఎలక్ట్రికల్ స్కీం కింద రూ. 10 వేల రకు సబ్సిడీ అందిస్తోంది.

- గంటెడి వినయ్ కుమార్

పెట్రోలు బాధలు తప్పాయి



ఎలక్ట్రిక్ వాహనం కొనుగోలు చేసి సుమారు నాలుగు నెలలు అవుతోంది. పెట్రోలు బాధలు తప్పాయి. ఇటీవల కాలంలో అనేక మంది ఈ-వెహికల్స్ పట్ల మొగ్గు చూపుతున్నారు. ప్రయాణం సైతం సౌకర్యవంతంగా ఉంటోంది. లగేజీ తీసుకవెళ్లడానికి సైతం వీలుగా ఉంది. రాత్రి సమయంలో చార్జింగ్ పెడుతున్నాను. దినమంతా వినియోగించుకోవడానికి వీలుఅవుతోంది.

- బట్టు ప్రవీణ్, వాహన చోదకుడు, జగిత్యాల

న్యూస్ బాక్స్

నవంబరు 5 నుంచి బీఎడ్ రెండో సెమిస్టర్ పరీక్షలు

గణేశ్‌నగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎస్‌యూ పరిధిలోని బీఎ డ్ రెండో సెమిస్టర్ పరీక్షలు నవంబరు 5 నుంచి ప్రారంభం అవుతాయని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్‌వీ శ్రీ రంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలి పారు. పరీక్షలను మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాల కోసం www.sata vahana. ac.in వెబ్‌సైట్ సందర్శించాలని పరీక్షల నియంత్రణాధికారి సూచించారు.

ఫార్మసీ కళాశాలను సందర్శించిన వీసీ

గణేశ్‌నగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం ఎల్ఎండీ క్యాంపస్ లోగల ఫార్మసీ కళాశాలను విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య యు ఉమేష్‌కుమార్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీశైలం, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వై కిషోర్ వీసీకి స్వాగతం పలికారు. అనంతరం క్యాంపస్‌లో గల వివిధ భవనాలను వీసీ పరిశీలించారు. ప్రిన్సిపాల్, సిబ్బందితో పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులకు, వసతి గృహాలకు నూతన భవనాలు, క్యాంపస్ స్థలానికి ప్రహరీ నిర్మించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

29న హ్యాండ్‌బాల్ ఉమ్మడి జిల్లా స్థాయి ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 25: ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 29న కొత్తపల్లిలోని అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో ఉమ్మడి జిల్లాస్థాయి సబ్‌జూనియర్ బాలికల ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు నవంబరు 2 నుంచి 4 వరకు ఆసిఫాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ ప్రతంతో ఉదయం 10 గంటలకు సంయుక్త కార్యదర్శి ఎస్ ప్రభాకర్, హ్యాండ్‌బాల్ కోచ్ మూల వెంకటేష్, పీఈటీ శ్రీధర్‌కు రిపోర్టు చేయాలని కోరారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు వివరాలకు 9441925807 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి

ఉమ్మడి జిల్లా పరిధిలో వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందారు. జగిత్యాల జిల్లా వెల్లుల్ల గ్రామ శివారులో శుక్రవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దురు మృతి చెందారు. జిల్లా కేంద్రంలోని గొల్లపల్లి రహదారిపై జరిగిన ప్రమాదంలో ఓ వృద్ధుడు., పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీ, ఎఫ్‌సీఐ రహదారిలో జరిగిన ప్రమాదంలో యువకుడు మృతి చెందారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ: ఇద్దరి దుర్మరణం

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా వెల్లుల్ల గ్రామ శివారులో శుక్రవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దురు మృతి చెందారు. మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..మెట్‌పల్లి మండలంలోని బండలింగాపూర్ గ్రామానికి చెందిన పోతుగంటి శ్రీనివాస్(45) మేనల్లుడైన నివాస్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై శుక్రవారం రాయికల్‌లో ఓ శుభకార్యానికి వెళ్లి స్వగ్రామానికి తిరుగుముఖం పట్టారు. అదే సమయంలో మెట్‌పల్లికి చెందిన దగ్గుల స్వామి(55) వెల్లుల్లలో ఉన్న తల్లిని కలిసి వస్తున్నాడు. ఈ క్రమంలో వెల్లుల్ల గ్రామ శివారులోని ఎల్లమ్మ ఆలయం సమీపంలో వీరి వాహనాలు ఢీకొనడంతో పోతుగంటి శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలై సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. నివాస్‌కు స్వల్ప గాయాలయ్యాయి. దగ్గుల స్వామికి తలకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను మెట్‌పల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు దగ్గుల స్వామిని నిజామాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. పోతుగంటి శ్రీనివాస్‌కు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. దగ్గుల స్వామికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బైపాస్ రోడ్డుపై ..

జగిత్యాల క్రైం, అక్టోబరు 25 (ఆంధ్ర జ్యోతి): జిల్లా కేంద్రంలోని గొల్లపల్లి రహ దారిలో ఎదురె దురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఓ వృద్ధుడు శుక్రవారం మృతి చెందాడు. పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన మనోజ్ కుమార్ (63) అనే వృద్ధుడు తన ద్విచక్ర వాహ నంపై జగిత్యాల నుంచి గొల్లపల్లి వైపు వెళుతున్నాడు. గొల్లపల్లి నుంచి ప్రవీణ్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై జగిత్యాలకు వస్తున్న క్రమంలో గొల్లపల్లి బైపాస్ సమీపంలో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. తీవ్ర గాయాలైన మనోజ్‌కుమార్ మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడు..

జ్యోతినగర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీ, ఎఫ్‌సీఐ రహదారిలోని ఆర్‌ఆర్ గార్డెన్స్ సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సరిపురం వంశీ(28) అనే యువకుడు దుర్మరణం చెందాడు. ఎన్టీపీసీ నుంచి గోదావరిఖనికి వెళ్తున్న క్రమంలో ఆర్‌ఆర్ గార్డెన్స్ సమీపంలో బైక్ అదుపు తప్పి కిందపడిని వంశీకి తలకు, ఇతర చోట్ల బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే చనిపోయాడు. బైక్ నడిపిన సాయిసతీష్ తీవ్రంగా గాయపడ్డాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్టీపీసీ ఎస్‌ఐ కె.సతీష్ తెలిపారు.


వెల్లుల్ల శివారులో ఢీకొన్న బైక్‌లు



మృతి చెందిన శ్రీనివాస్, స్వామి(ఫైల్)

స్వీట్ మెమొరీ..

- జ్ఞాపికల తయారీతో స్వయం ఉపాధి

గణేశ్‌నగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సందర్భం ఏదైనా.. మనం ఆత్మీయులకు అందించే జ్ఞాపికలు కలకాలం నిలిచిపోతాయి. అలాంటి జ్ఞాపికల తయారీలో తనదైన ముద్రను వేస్తున్నారు కరీంనగర్‌కు చెందిన దూడం తిరుపతి. ఏడో తరగతి వరకు చదువుకున్నా జ్ఞాపికల తయారీలో పట్టు సాధించాడు. 2011లో లతా గ్రాఫిక్స్ పేరుతో ఓ సంస్థను ఏర్పాటు చేసుకుని మెమొంటోలు తయారు చేస్తూ పలువురికి ఉపాధి కల్పిస్తున్నాడు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కొత్తకొత్త డిజైన్లలో మెమొంటోలు తయారు చేస్తున్నాడు. ఇందుకోసం కంప్యూటర్‌పై అవగాహన పెంచుకున్నాడు. తనకవసరమైన డిజైన్లను కంప్యూటర్‌పై రూపొందించి మెమొంటోలు తయారు చేస్తాడు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలు సంస్థలకు ఆయన అందమైన మెమొంటోస్ తయారు చేసి ఇచ్చాడు. వుడ్ కటింగ్ మెమొంటోలు, క్రిస్టల్, డిజిటల్ మెమొంటోలు, యోగ్యతాపత్రాలు, సన్మాన పత్రాలు ఆయన తయారు చేస్తున్నాడు. మెమెంటోలు ఆయా డిజైన్లను బట్టి 50 నుంచి ఐదు వేల రూపాయల వరకు ధర ఉంటుంది. జిల్లా కేంద్రంలో నిర్వహించిన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు తిరుపతి తయారుచేసిన జ్ఞాపికలనే అందించాడు.


మెమొంటోలను తయారు చేస్తున్న దూడం తిరుపతి


కంప్యూటర్‌లో మెమొంటోలను డిజైన్ చేస్తున్న తిరుపతి

● ప్రభుత్వం ప్రోత్సహిస్తే యువతకు శిక్షణ ఇస్తా..



ఎంతో మంది నిరుద్యోగ యువత ఉపాధిలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం మాలాంటి వాళ్లకు ప్రోత్సాహం అందిస్తే యువతకు జ్ఞాపికల తయారీ రంగంలో ప్రత్యేక శిక్షణను అందించడానికి సిద్ధంగా ఉన్నాం.

- దూడం తిరుపతి

వానరాల మృత్యువాత

వేములవాడ టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి గ్రామ శివారులో శుక్రవారం వానరాలు మృత్యువాత పడ్డాయి. వేములవాడ విలీన గ్రామమైన ఆరో వార్డు శాంతినగర్ సమీపంలోని ఓ చెట్ల పొదల్లో 50 కోతులను మృతి చెంది కనిపించాయి. గుర్తు తెలియన దుర్మార్గులు విషప్రయోగం చేసి కోతులను చంపినట్లు స్థానికులు అనుమానిస్తున్నారు. విచారణ చేసి బాధ్యులను శిక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కోతుల కళేబరాలను మున్సిపల్ సిబ్బంది డంపింగ్ యార్డుకు తరలించారు. ఈ సంఘటనపై వేములవాడ పోలీసులను వివరణ కోరగా ఈ సంఘటనపై విచారణ చేస్తున్నామని పేర్కొన్నారు.


కోతుల కళేబరాలను తరలిస్తున్న సిబ్బంది

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

- అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించిన కేటీఆర్

తంగళ్లపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల శివారులో ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సిరిసిల్ల పట్టణానికి చెందిన సామంతుల రమేష్, నర్సింహుల పల్లె గ్రామానికి చెందిన వేల్పుల సంజీవ్ ద్విచక్ర వాహనంపై సిరిసిల్ల వైపు వెళ్తున్నారు. వెనక నుంచి వచ్చి కారు ఢీ కొట్టింది. దీంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సిరిసిల్లలో పలు కార్యక్రమంలో పాల్గొని హైదరాబాద్ వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు ప్రమాదాన్ని చూసి వివరాలు అడిగి తెసుకున్నారు. 108 వాహనాలకు ఫోన్ చేయడం తోపాటు క్షతగాత్రులకు ధైర్యం చెప్పారు. గాయపడ్డ వారిని 108లో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు.


వివరాలు తెలుసుకుంటున్న కేటీఆర్

అంతర్జాతీయ చలనచిత్రోత్సవానికి 'మోనిహార' ఎంపిక


వారాల అన్వేష్

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌కు చెందిన ప్రస్తుతం హైదరాబాద్‌లో సినిమా రంగంలో ఉన్న వారాల అన్వేష్ అనే యువకుడు డైరెక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీగా రూపొందించిన 'మోనిహార' 55వ అంతర్జాతీయ చలనచిత్రోత్సవానికి ఎంపికైంది. ఈ మేరకు కేంద్ర సమాచార ప్రసారాల శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నవంబరు 20 నుచి 28 వరకు గోవాలో నిర్వహించే 55వ ఇఫీ (ఐఎఫ్ఎఫ్ఐ) చలనచిత్రోత్సవంలో వివిధ భారతీయ భాషల్లోంచి వచ్చిన నాన్ ఫీచర్ సినిమాల ఎంపికలో 'మోనిహార' ఒకటి. ఈ చిత్రం బెంగాలి భాషలో నిర్మించారు. కోల్‌కత్తాలోని సత్యజిత్‌రే ఫిలిం ఇనిస్టిట్యూట్‌లో అన్వేష్ సినిమాటోగ్రఫిలో పీజీ కోర్సు పూర్తి చేశారు. విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగోర్ రాసిన 'మోనిహార' కథ ఆధారంగా ఈ చిత్రం రూపొందింది. ఈ చిత్రానికి సుభాదీప్ బిస్వామి దర్శకత్వం వహించారు. అన్వేష్‌కు పలువురు సినిమా, లఘుచిత్ర రంగ బాధ్యులు నటులు తదితరులు అభినందించారు.

కబడ్డీ పోటీల్లో ఎస్సారార్‌కు ద్వితీయ స్థానం

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీలో నిర్వహించిన అంతర కళాశాలల కబడ్డీ పోటీల్లో ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ సైన్స్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానం సాధించారు. అలాగే అంతర విశ్వవిద్యాలయాల కబడ్డీ పోటీలకు క ళాశాల విద్యార్థులు సంజయ్, మనీంద్ర, ఎండీ అజహర్‌లు ఎంపికయ్యారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె రామకృష్ణ, పీడీ నాగేశ్వర్‌రావు, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ టి రాజయ్య, అధ్యాపకుడు సత్యప్రకాశ్, తదితరులు అభినందించారు.

కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి



రైల్వే స్టేషన్‌లో నిరసన తెలియజేస్తున్న వైఎఫ్ఐ జిల్లా నాయకులు

కరీంనగర్ రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రైల్వే శాఖలో ఖాళీ పోస్టులను రిటైర్డ్ ఉద్యోగులతో భర్తీ చేయాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి డిమాండ్ చేశారు. శుక్రవారం నగర శివారులోని రైల్వే స్టేషన్‌లో డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేలో సిబ్బంది కొరత ఉందని, సుమారు 25వేల ఉద్యోగాలను రిటైర్డ్ ఉద్యోగులతో భర్తీ చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం సిగ్గుచేటని విమర్శించారు. దేశంలో ఉద్యోగాలు రాక నిరుద్యోగ యువత కుటుంబ పోషణ భారమై ఆత్మ బలిదానాలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత స్థాయి చదువులు చదివి తీర సమయానికి ఉద్యోగాలు రాక నిరాశకు గురైన యువతకు రైల్వే శాఖ ఉద్యోగాలలో నోటిఫికేషన్ విడుదల చేసి ఉద్యోగాల భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు జావిద్ హుస్సేన్, కృపాల్ సింగ్, రాజు, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

రామగుండంలో స్ర్కాప్ చోరీపై విజిలెన్స్ విచారణ

కోల్‌సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని స్ర్కాప్ చోరీపై విజిలెన్స్ విచారణ జరుగుతుంది. శుక్రవారం కరీంనగర్‌లో విజిలెన్స్ అధికారులు రామగుండం నగరపాలక సంస్థలో పని చేసిన పలువురు అధికారులను విచారించారు. స్ర్కాప్ చోరీ ఘటనపై ఎఫ్ఐఆర్‌తో పాటు ఇప్పటికే నమోదు చేసిన పలువురు స్టేట్‌మెంట్ల ఆధారంగా అధికారులను విచారించారు. ఏయే అధికారులు స్ర్కాప్‌కు కస్టోడియన్‌గా ఉన్నారు, ఏ రోజు చోరీ జరిగింది. ఎంత మొత్తంలో చోరీ జరిగిందనే కోణంలో విచారణ జరిపారు. కార్పొరేషన్ ఉన్నతాధికారులతో పాటు ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, పారిశుధ్య విభాగాలకు చెందిన ఆరుగురు అధికారులను విచారించినట్టు సమాచారం. స్ర్కాప్ చోరీ రామగుండంలో తీవ్ర చర్చనీయాంశం అయ్యింది. కొందరు ప్రజా ప్రతినిధుల ప్రమేయం ప్రస్ఫుటమయ్యింది. ఇటీవల పోలీస్ ఉన్నతాధికారులు కూడా ఈ కేసు పెండింగ్ గురించి ఆరా తీశారు. ఇదే సమయంలో విజిలెన్స్ విచారణ, వివిధ విభాగాలకు చెందిన అధికారులను పిలిపించడం తీవ్ర చర్చనీయాంశం అయ్యింది. కాగా, రామగుండం పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలో జరిగిన చోరీ ఘటనలో కొందరు టౌన్‌ప్లానింగ్ అధికారులు బలిపశువులయ్యారనే ప్రచారం జరుగుతోంది. అప్పటి కమిషనర్ శంకర్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే సమయంలో నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి పలువురు టౌన్ ప్లానింగ్ అధికారులను కస్టోడియన్లుగా పేర్కొన్నట్టు సమాచారం. పోలీస్‌శాఖ నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా టౌన్ ప్లానింగ్ అధికారులకు విజిలెన్స్ నోటీసులు ఇచ్చింది. కాగా ఈ ఘటనలో పూర్తి విచారణ జరపాలని పలువురు అధికారులు పోలీస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు తెలుస్తోంది.

వారెవ్వా.. వావిలాల ఖాదీ

ఖాదీ.. ఈ పేరు వింటేనే అందరికీ మహాత్ముడి విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమం గుర్తుకువస్తోంది. ఆ ఉద్యమంలో భాగంగా 1924లో వావిలాలలో ఖాదీ వస్త్రోత్పత్తి ప్రారంభమైంది. 1983 ప్రతిష్ఠాన్‌గా రూపొంది ఎన్నో అవార్డులు సాధించింది. ఇక్కడ తయారైన మువ్వన్నెల జెండా ఢిల్లీ ఎర్రకోటపై రెపరెపలాడింది. ఇండియన్ రైల్వేస్ తన సిబ్బంది యూనిఫామ్స్‌కు ఇక్కడ రూపొందించిన వస్త్రాలనే ఉపయోగిస్తోంది. రెడీమేడ్ దుస్తుల జోరులోనూ వావిలాల ఖాదీ వస్త్రాలు తమ ప్రత్యేకతను చాటుకుంటున్నాయి.




రంగులు అద్ది ఆరబెట్టిన ధారం

- ఏటా కోట్లాది రూపాయల ఉత్పత్తులు
- వెయ్యి మంది కార్మికులకు ఉపాధి
- రెడిమేడ్ దుస్తులకు ధీటుగా వెరైటీ డిజైన్ల తయారీ

జమ్మికుంట రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో మొదలైన వావిలాల ఖాదీ పరిశ్రమ స్వాతంత్రానంతరం వచ్చిన అనేక మార్పులకు తట్టుకుని నిలబడింది. మార్కెట్‌లో వచ్చిన పారిశ్రామిక ఉత్పత్తుల పోటీని తట్టుకుని వాటికి దీటుగా అందమైన డిజైన్లను రూపకల్పన చేస్తోంది. స్థానికంగా వేయికి పైగా కుటుంబాలకు ఉపాధినిస్తున్న వావిలాల ఖాదీ దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఖాదీ వస్త్ర ప్రియుల మన్ననలను వందేళ్లుగా పొందుతోంది.మంది ఖాదీ పి మహాత్మా గాంధీ స్ఫూర్తితో వావిలాల ఖాదీ ప్రతిష్ఠాన్‌ను ప్రారంభించారు. ఈ సంస్థ తన ప్రస్థానంలో ఎన్నో మైలు రాళ్లను అధిగమించింది. ఎర్రకోటపై రెపరెపలాడిన త్రివర్ణ పతాకం ఇక్కడి నేత కార్మికుల చేతుల మీదుగా రూపు దిద్దుకుంది. వంద సంవత్సరాల క్రితం ఏర్పాటైన ఖాదీ సంస్థ 1983లో ప్రతిష్ఠాన్‌గా రూపుదిద్దుకుంది. ఏటా కోట్లాది రూపాయాల ఉత్పత్తులను తయారు చేస్తూ వెయ్యి మందికి పైగా కార్మికులకు ఉపాధి అందిస్తోంది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వెరైటీ డిజైన్ల తయారీతో రెడీమేడ్ దుస్తులకు గట్టి పోటీ ఇస్తోంది. ఇటీవలి కాలంలో యువత ఖాదీ వస్త్రాలపై మొగ్గు చూపుతుండడంతో నయా ట్రెండ్ మొదలైంది.

● 1924లో ప్రారంభం

గాంధీజీ ఇచ్చిన పిలుపు మేరకు జమ్మికుంట మండలం వావిలాల గ్రామంలో 1924లో అఖిల భారత చరకా సంఘ్‌లో భాగంగా ఖాదీ వస్త్రోత్పత్తి ప్రారంభమైంది. అన్నాసాహెబ్ సహస్ర బుద్ధే, లేలేజీ వంటి వారు ఇక్కడ ఖాదీ సంస్థను ప్రారంభించారు. 1983లో వావిలాల ఖాదీ గ్రామోద్యోగ ప్రతిష్ఠాన్‌గా ఆవిర్భవించింది. 13 ఎకరాల విస్తీర్ణంలో ఖాదీ వస్త్రాలయం ఉంది.

● కార్మికులకు నీడను ఇస్తున్న సంస్థ

ఖాదీ ప్రతిష్ఠాన్‌లో దూది నుంచి ఏకులు వడకడం మొదలు కార్పెట్లు నేసే వరకూ ప్రతి పనిని కార్మికులు వారు తయారు చేసుకున్న యంత్రాలతోనే చేస్తారు. తెలంగాణలోనే ఏకైక సింప్లెక్స్ (కార్డింగ్) మిషన్ వావిలాల ఖాదీ ప్రతిష్ఠాన్‌లో ఉంది. కోయంబత్తూర్ నుంచి ఈ మిషన్‌ను ప్రత్యేకంగా తెప్పించారు. ఇక్కడ నేసే కార్పెట్లకు మంచి గిరాకీ ఉంది. రోజుల తరబడి నలుగురు అంతకంటే ఎక్కువ మంది కార్మికులు కష్టపడితే తప్ప ఒక్క కార్పెట్ తయారవదు. మామూలు రాట్నానికి కొంత సాంకేతికతను జోడించి తయారు చేసిన సైకిల్ రాట్నాన్ని తయారు చేశారు. ఈ రాట్నం ద్వారా ఒకేసారి 16 కుదుళ్లను పెట్టి రోజుకు మహిళా కూలీ 40 చిట్టాల వరకు తయారు చేస్తుంది.

● విస్తరించిన ఉత్పత్తులు

వావిలాలలో ప్రారంభమైన ఖాదీ వస్త్రాల ఉత్పత్తి తర్వాతికాలంలో హుజూరాబాద్ మండలం రాంపూర్, వరంగల్ జిల్లా మొగుళ్లపల్లి, తొర్రూర్ మండల కేంద్రాల్లో మొదలయ్యింది. ఆయా కేంద్రాల్లో తయారు చేసిన వివిధ రకాల వస్త్రాలను వావిలాలకు తరలించి అక్కడి నుంచి మర్కెటింగ్ కేంద్రాలకు పంపుతున్నారు. ఇండియన్ రైల్వేస్ తమ యూనిఫామ్స్‌కు వావిలాల ఖాదీ వస్త్రాలనే ఉపయోగిస్తోంది. ముంబై, ఢిల్లీ, కేరళ, చెన్నై ఖాదీ కమిషన్లు ఇక్కడి ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నాయి. కోల్‌కతా, నాగ్‌పూర్, కోయంబత్తూరు, బెంగళూరు, అహ్మదాబాద్, మధురై నగరాలకు ఇక్కడి ఉత్పత్తులు సరఫరా అవుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పలు మార్కెటింగ్ కేంద్రాల ద్వారా ఖాదీ ఉత్పత్తులు విక్రయిస్తున్నారు. యేటా నాలుగు ఉత్పత్తి కేంద్రాల ద్వారా నాలుగు కోట్ల పైచిలుకు విలువైన వస్త్రాలు ఉత్పత్తి చేస్తున్నారు. విక్రయ కేంద్రాల ద్వారా ఖాదీ వస్త్రాలతో పాటు తేనె, శాండల్ పౌడర్, సబ్బులు, అగర్‌బత్తీలు, గిఫ్ట్ ఆర్టికల్స్ విక్రయిస్తున్నారు. సూటింగ్స్, షర్టింగ్స్, చద్దర్లు, కార్పెట్లు, టవల్స్, లుంగీలు, చీరలు, ఖర్చీఫ్స్, తదితర ఖాదీ ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది.

● వస్త్రాల తయారీ ఇలా...



కర్ణాటకలోని చిత్రదుర్గ ఖాదీ కమిషన్ నుంచి వావిలాల ఖాదీ ప్రతిష్ఠాన్ శుద్ధి చేసిన దూదిని కొనుగోలు చేస్తుంది. సింప్లెక్స్, డ్రాయింగ్ మిషన్లతో ఏకులు వడికి, వాటిని 8, 16 కుదుళ్ల రాట్నాలపై కార్మికులతో వడికిస్తారు. ఇలా తయారైన దారానికి అవ సరం మేరకు రంగులు అద్దుతారు. ఈ దా రాన్ని వార్పింగ్ యంత్రాలపై భీములు తయారు చేసి నేత కోసం కార్మికులకు అందజేస్తారు. కార్మికులు నేసిన వస్త్రాన్ని బ్లీచింగ్ పౌడర్ కలిపిన నీటిలో రెండు రోజు ల పాటు ఉంచి స్టార్చ్, నీలి, కినోపాల్ మిశ్రమంతో కలిపి ఆరేస్తారు. దానిని ఇస్త్రీ చేసి మీటర్ చొప్పున ఫోల్డింగ్ చేస్తారు. చివరగా కార్మికులు వస్త్రాలపై పోగులు తొలగించి అమ్మకం కోసం పంపుతారు.

● ఆటుపోట్లు ఎదురైనా..

ఐఎస్‌వో 9000 సర్టిఫైడ్ కంపెనీ అయిన వావిలాల ఖాదీ ప్రతిష్ఠాన్ అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటూనే మార్కెట్‌లో నిలబడుతోంది. ఖాదీ వస్త్రాల ఉత్పత్తిపై కేంద్ర ప్రభుత్వం 20 శాతం ప్రోత్సాహకంగా ఇస్తుండగా, అంతే మొత్తాన్ని ఖాదీ ప్రతిష్ఠాన్ తమ అమ్మకాలపై వినియోగదారులకు రాయితీగా అందజేస్తోంది. కేంద్రం ఇచ్చే ప్రోత్సాహకానికి తోడు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా మరో 20శాతం రిబేట్, ఇన్స్‌రెన్స్, పెన్షన్, సంస్థకు డిస్కౌంట్లు ఇస్తే ఖాదీ మరింత వృద్ధి చెందే అవకాశం ఉంది

● ఎర్రకోటపై రెపరెప లాడిన వావిలాల జెండా

వావిలాల ఖాదీ ఢిల్లీ ఎర్రకోటపై రెపరెపలాడింది. 1989 ఆగస్టు 15న అప్పటి భారత ప్రధాని రాజీవ్‌గాంధీ ఎర్రకోటపై వావిలాల ఖాదీ నుంచి పంపిన మువ్వన్నెల జెండాను ఎగురువేశారు.

● ఖాదీ వస్త్రాలపై యువత ఆసక్తి

రెడిమెడ్ వస్త్రాలకు దీటుగా ఖాదీ సంస్థ వెరైటీ డిజైన్లతో వస్త్రాల ఉత్పత్తి చేస్తుండడంతో యువత ఆసక్తి కనబరుస్తుంది. వావిలాల ఖాదీలో వస్త్రాలు కొనుగోలు చేసేందుకు సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు వస్తుంటారు.


ధారం తయారీ యంత్రం


వెరైటీ డిజైన్ల వస్త్రాలు

న్యూస్ బాక్స్

రేపు సికింద్రాబాద్ సదర్

కరీంనగర్ టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఎన్‌టీఆర్ స్టేడియంలో ఆదివారం సికింద్రాబాద్ మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సికింద్రాబాద్ సదర్ మహోత్సవాల కరపత్రాన్ని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ ఉద్యమ పోరాట యోధుడు రాజారాం యాదవ్, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేటర్ జంగిలి ఐలేందర్‌యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు నాగారపు సత్యనారాయణ యాదవ్‌తో కలిసి ఆవిష్కరించారు. శుక్రవారం కోర్టు సమీపంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మంచాల రవీందర్‌యాదవ్, కాల్వ మల్లేశం యాదవ్, కొత్తపల్లి మండల అధ్యక్షుడు పరుశరామ్ యాదవ్, కరీంనగర్ అధ్యక్షుడు సాయవేణి రవీందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సికింద్రాబాద్ సదర్ మహోత్స వాలకు జిల్లాలోని యాదవ ప్రజాప్రతినిధులు, నాయకులు, యాదవ సంఘం జిల్లా, మండల కమిటీల అధ్యక్ష, కార్యదర్శులు, బాధ్యులు, యాదవ సంఘ ప్రముఖులు తరలి రావాలని విజ్ఞప్తి చేశారు.

రెండిళ్లలో చోరీ

కరీంనగర్ క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని రెండిళ్లలో చోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. రాంనగర్ రోడ్డు నెంబర్ 8లో నివాసం ఉంటున్న కూర కిషన్ స్టాంప్ వెండర్‌గా పనిచేస్తున్నాడు. తన ఇంటికి తాళం వేసి గురువారం రాత్రి నగరంలోని కుమార్తె ఇంటికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళం పగలగొట్టి ఉండటాన్ని గుర్తించారు. ఇంట్లో నిల్వ ఉ న్న రూ. 20వేల విలువగల స్టాంప్ పేప ర్స్ రూ.50వేల నగదు చోరీకి గురైనట్లు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

● వన్‌టౌన్ పరిధిలోని వినాయకనగర్ రోడ్డు నంబర్ 4లో నివాసం ఉంటున్న కాట రమేష్ వ్యాపారం చేస్తున్నాడు. అతని సోదరుడు మృతి చెందటంతో మానకొండూర్ మండలం కెల్లెడకు వెళ్లి శుక్రవారం మధ్యాహ్నం ఇంటికి వచ్చాడు. ఇంట్లో బీరువా పగలగొట్టి ఉండటాన్ని గుర్తించాడు. అందులో ఉన్న వస్తువులు కిందపడేసి ఉండటంతో పోలీసులకు సమాచారం అందించగా సీఐ కోటేశ్వర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఇంట్లో బీరువాలో ఉంచిన 4.5 తులాల బంగారం, 10 తులాల వెండి వస్తువులు చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

నేడు బీడీ కార్మికుల మహాసభ

మల్యాల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండల కేంద్రంలో శనివారం బీడీ కార్మికు జగిత్యాల జిల్లా రెండో మహాసభ నిర్వహిస్తున్నామని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొక్కుల శాంత, సుతారి రాములు కోరారు. స్థానికంగా శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండ గట్టేందుకు ఈ మహాసభ నిర్వహి స్తున్నామని చెప్పారు. బీడీ కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు విశ్వనాథం, ముత్రం, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయంపై రైతుల ఆశలు

● గెలలు వేసిన ఆయిల్ పామ్ చెట్లు.. ● మూడేళ్ల శ్రమకు దక్కనున్న ప్రతిఫలం ● మరో 4 నెలల్లో అమ్మకాలు షురూ..

జిల్లాలోని ఆయిల్‌పామ్ రైతులు ఆదాయంపై ఆశలు పెంచుకుంటున్నారు. మూడేళ్ల క్రితం తాము నాటిన ఆయిల్ పామ్ చెట్లు కాపుకొచ్చాయి.. చెట్లకున్న గెలలను చూసి రైతులు ఆదాయాన్ని అంచనా వేస్తున్నారు. మరో మూడు నెలల్లో మార్కెట్‌లో పంటను విక్రయించే అవకాశాలున్నాయి.


ఆయిల్‌పామ్స్ తోటలు


ఆయిల్‌పామ్ కాయలు


గెలలు వేసిన ఆయిల్‌పామ్ చెట్లు

మంథని/ముత్తారం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మూడేళ్ల క్రితం సాగు చేసిన ఆయిల్‌పామ్ తోటలు మొదటి సారి కాపునకు వచ్చాయి. ప్రస్తుతం చాలా చోట్ల చెట్లకు కాయల గెలలు వేశాయి. దీంతో తొలి దశలో ఎకరాకు 3-5 టన్నులు దిగుబడి వస్తుందని అధి కారులు అంచనా వేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాల ప్రోత్సాహంతో జిల్లాలో మూడేళ్ల క్రితం మలే షియా, సింగపూర్ నుంచి బ్రీడ్ తెచ్చి నాటిన ఆయిల్ పామ్ తోటల్లో కాపు (గెలలు వేయడం) ప్రారంభమైంది. జిల్లాలోని ఉద్యానవశాఖ అధికారులు ఖమ్మం జిల్లా అశ్వరావుపేట నుంచి తేనెటీగలు (వీవిల్స్) తెప్పించి ఆయిల్‌పామ్ మొగ్గలను పలదీకరణం చెందించడంతో గెలల సంఖ్య బాగా పెరిగింది. ఒక్కో మొక్కకు ఆరు నుంచి 10 గెలలు వేయగా, మరో నాలుగు నెలల్లో తొలి పంట కోతకు రానుంది.

● జిల్లాలో 2.393 వేల ఎకరాల్లో సాగు..

జిల్లాలోని 14 మండలాల్లో 938 మందికి పైగా రైతులు సుమారు 2,393వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలు సాగుచేశారు. మంథని డివిజన్లో మంథని, రామగిరి, ముత్తారం, కమాన్‌పూర్ మండలాల్లో 324 మంది రైతులు 855 ఎకరాల్లో సాగు చేశారు. ఆయిల్‌పామ్ చెట్లు నాటిన ఏడాదినుంచి గెలలు వేయగా, అధికా రుల సూచనల మేరకు రైతులు మొదటి రెండు సంవత్సరాలు వాటిని తీసేసి, మూడో సంవత్సరం ప్రారంభం నుంచి మంచి దిగుబడి కోసం ఎదురుచూస్తున్నారు. ఎకరాకు 10 టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం టన్నుకు మార్కెట్లో రూ.18 వేలు ధర పలుకుతోంది.

దీర్ఘకాలిక ప్రయోజనం పొందవచ్చు..



ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరుతుంది. నీటి సౌకర్యం కలిగిన భూముల్లో ఈ పంట సాగు చేసుకోవచ్చు. ఆయిల్‌పామ్ మొక్కలు నాటిన మూడేళ్ల అనంతరం పంట దిగుబడి ప్రారంభమవుతుంది. సుమారు మూడు దశాబ్దాల పాటు గెలలు వేయడంతో దీర్ఘకాలిక ఆదాయం పొందవచ్చు. నేను మూడు ఎకరాల్లో సాగు చేశాను. మరో నాలుగు నెలల్లో తొలిసారిగా ఆదాయం రానున్నది.

- కల్యాణపు రాయమల్లు, ముత్తారం

హుండీ లెక్కింపులో ఉద్యోగి చేతివాటం

- రూ. 2 లక్షల విలువైన నగదు కాజేసేందుకు యత్నం
- అనుమానంతో విచారించిన భద్రతా సిబ్బంది
- ఉద్యోగిని సస్పెండ్ చేసిన ఆలయ ఈవో వినోద్‌రెడ్డి

వేములవాడ కల్చరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపులో ఓ ఉద్యోగి చేతివాటాన్ని ప్రదర్శించాడు. వేములవాడ రాజన్నపై ఎంతో నమ్మకంతో భక్తులు హుండీలో వేసిన కానుకలు పక్కదారి పట్టడం పట్టణంలో శుక్రవారం కలకలం రేపింది. రాజన్న ఆలయ హుండీలను గురువారం లెక్కించారు. ఈ క్రమంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి నగదు కాజేసేందుకు యత్నించినట్లు భద్రత సిబ్బంది గుర్తించారు. హుండీ కౌంటింగ్ పూర్తయిన పిదప కౌంటింగ్ హాల్‌లో ఉద్యోగి కనిపించడంతో అనుమానం వచ్చిన భద్రత సిబ్బంది తనిఖీ చేశారు. సుమారుగా రూ.2 లక్షల నగదును కాజేసే వ్యవ హారం బయటపడింది. విషయం బయటకు పొక్కకుండా అధికారలు జాగ్రత్త పడడం చర్చనీయాంశమైంది.

- ఆలయ ఉద్యోగుల హస్తం ఉందని అనుమానాలు..

రాజన్న ఆలయ హుండీల లెక్కింపులో పలు మార్లు ఉద్యోగులు చేతివాటం ప్రదర్శించిన విషయం తెలిసిందే. అయితే రాజన్న ఆలయం లోని ఉద్యోగులు ఒక టీమ్‌గా ఏర్పాటు కావడంతోనే ఇలాంటి సంఘ టనలు జరుగుతాయని, కౌంటింగ్ హాల్ పక్కన కోడెల క్యూలైన్‌ను ఆనుకుని ఉన్న ఇనుపజాలీ సైతం సగం వరకు తొలగించి కనిపించడంతో నగదు, బంగారం, వెండి పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలు వె ల్లువెత్తుతున్నాయి. హుండీ కౌంటింగ్‌లో ఆలయ ఉద్యోగులతో పాటు స్వచ్ఛంద సంస్థల భజన మండలి సభ్యులు పాల్గొంటారు. హుండీ లెక్కిం పులో సీసీ కెమెరాలు, భద్రతా సిబ్బంది తనిఖీలు చేస్తూనే ఉంటారు. ఉద్యోగుల చేతివాటం ప్రదర్శించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైన ఈ వ్యవహారంలో సీసీ కెమెరాలను పరిశీలించి విచారణ చేసి నిజానిజాలను తేల్చాలని భక్తులు, పట్టణవాసులు కోరుతున్నారు.

నగదు దొరికింది నిజమే..

రాజన్న ఆలయ ఓపెన్‌స్లాబ్‌లో హుండీ లెక్కింపులో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి నగదు కాజేసే యత్నం చేసింది నిజమే. అనుమానంగా కనిపించడంతో భద్రత సిబ్బంది 20 నుంచి 30 ఐదు వందల నోట్లను గుర్తించి పట్టుకున్నారు. విచారణ చేసి సదరు ఉద్యోగిని విధుల్లో నుంచి తొలగించాం. హుండీ లెక్కింపులో మరింత భద్రతను పెంచుతాం.

- ఈవో వినోద్‌రెడ్డి

న్యూస్ బాక్స్

మత్స్య సహకార సంఘం అధ్యక్షుడిగా పెండం రాజేశం

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కూనారం, మంగపేట మత్స్య సహకార సంఘం పెండం రాజేశంను డైరెక్టర్లు శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా జంగిటి కొమురయ్య, కార్యదర్శి జంగిటి సదానందంను డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సింగిల్ విండో కార్యాలయంలో ఎన్నికల అధికారి పలకల సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. అనంతరం ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శికి ఎన్నిక పత్రాలు అందజేశారు. అనంతరం గెలుపొందిన వారిని సన్మానించారు.

ఆన్‌లైన్ పోటీలకు ఎంపిక

కోల్‌సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఆర్‌ఎఫ్‌సీఎల్‌లోని శ్రీచైతన్య విద్యార్థులు నవంబర్ 6న నిర్వహించే ప్రపంచ రికార్డ్ మ్యాథమటిక్స్ ఫార్ములకు 26మంది విద్యార్థులను ఎంపిక చేయడం జరిగిందని ప్రిన్సిపాల్ రవికాంత్ తెలిపారు. శుక్రవారం చైతన్య స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 20రాష్ట్రాల్లో 10వేల మంది విద్యార్థులతో 668 మ్యాథమటిక్స్ ఫార్ములను నిర్వహించి మూడు ప్రపంచ రికార్డులను సాధించిందని, నవంబర్ 6న నిర్వహించే ప్రపంచ రికార్డు కోసం మొదటిసారిగా ఆర్‌ఎఫ్‌సీఎల్ నుంచి 26మంది విద్యార్థులు పాల్గొననున్నారని, విద్యార్థుల మేధాశక్తిని పెంపొందించడానికి ప్రపంచ దేశాలతో చైతన్య విద్యార్థులు పోటీ పడుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ కోఆర్డినేటర్ సౌజన్య, లావణ్య పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్ 29వ డివిజన్ బాపూజీనగర్‌లో శ్రీకాంత్ డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత దంత వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ మహంకాళి స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ ప్రజలకు దంత సమస్యలు తీర్చడానికి ఈ శిబిరాన్ని నిర్వహించినట్టు, ఈ శిబిరానికి డివిజన్ ప్రజలు తరలివచ్చారని చెప్పారు. పరీక్షల అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శ్రీకాంత్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అబ్దుల్ బారీ

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా షేక్ అబ్దుల్‌బారీ, ప్రధానకార్యదర్శిగా సోమిశెట్టి తిరుపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా బీ అజయ్ కుమార్, జాయింట్ సెక్రెటరీగా ఎండి జహంగీర్, కోశాధికారిగా ఎండి అఫ్జల్ ఎన్నికయ్యారు. వీరిని అసోసియేషన్ సభ్యులు గురువారం ఘనంగా సత్కరించారు.

పశుగణన పోస్టర్ ఆవిష్కరణ

ఎలిగేడు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో శుక్రవారం పశుగణన 21వ అఖిల భారత పశుగణన పోస్టర్‌ను పశువైద్యులు ఝాన్సీ ఆవిష్కరించారు. పంచాయతీ కార్యదర్శి అంజలి, మండిగ రాజనర్సు, కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, బూర్ల వెంకటసత్యం, పశుమిత్ర సమ్మయ్య, రైతులు పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించాలి

ఓదెల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొలనూర్ కొనుగోలు కేంద్రంలో సౌకర్యాలు కల్పించాలని శుక్రవారం స్వశక్తి మహిళలు ఎమ్మెల్యే విజయరమణారావుకు వినతిపత్రాన్ని సమర్పించారు. విద్యుత్, తాగునీరు, మహిళలకు బాత్ రూమ్‌లు, సీసీఫ్లోరింగ్ చేయించాలని, కేంద్రం చుట్టూ ప్రహరీ నిర్మించాలని కోరారు. తూకం పూర్తయిన తర్వాత మిల్లులో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్వశక్తి మహిళలు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెడితే ఎవరినీ ఉపేక్షించం

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

జూలపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతన్నలను ఇబ్బందులకు గురిచేస్తే ఎవ్వరినీ ఉపేక్షించేది లేదని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు హెచ్చరించారు. మండలంలోని పెద్దాపూర్, తెలుకుంట, చీమలపేట, నాగులపల్లి గ్రామాల్లో శుక్రవారం ఎమ్మెల్యే విజయరమణారావు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కొనుగోలు కేంద్రాల్లో జరిగిన దోపిడీ విధానంతో రైతులు నష్టపోయారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తుందన్నారు. కాగా, తెలుకుంట ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రధానోపాధ్యాయులు రవిందర్, పోతునూరి సునితలు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ గండు సంజీవ్, విండో చైర్మన్ పుల్లూరి వేణుగోపాల్ రావు, ఏపీఎం సుధాకర్, ఆర్‌ఐ సంజిత్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొజ్జ శ్రీనివాస్, నాయకులు దండె వెంకటేశం, కందుకూరి అంజయ్య, బండి స్వామి, రవిందర్‌రెడ్డి, రవిందర్‌రావు, పలువురు పాల్గొన్నారు.

● ఎలిగేడు (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం కష్టపడి పండించిన వరిధాన్యాన్ని విక్రయించి మోసపోవద్దని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు రైతులకు సూచించారు. శుక్రవారం పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను విజయరమణారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో పీఏసీఎస్ చైర్మన్లు గోపు విజయభాస్కర్‌రెడ్డి, పుల్లూరి వేణుగోపాల్‌రావు, ధర్మారం మార్కెట్ కమిటీ చైర్మన్ గండు సంజీవ్, తహసీల్దార్ బషీరొద్దీన్, ఎంపీడీవో భాస్కర్‌రావు, ఐకేపీ ఏపీఎం సుధాకర్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, తాటిపల్లి రమేష్‌బాబు, నాయకులు కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, నరహరి సుధాకర్‌రెడ్డి, కొండ తిరుపతిగౌడ్, పల్లెర్ల వెంకటేష్‌గౌడ్, బూర్ల వెంకటసత్యం తదితరులు పాల్గొన్నారు.

● ఓదెల (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యేగా ఉన్నంతకాలం రైతులకు ఎలాంటి నష్టం జరగనివ్వనని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండలంలోని కొలనూర్‌లో శుక్రవారం సొసైటీ, సెర్ప్ఆధ్వర్యంలో నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల సుమన్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి రవి గౌడ్, సింగిల్ విండో మాజీ చైర్మన్ గోపు నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ సామశంకర్, సీఈవో గోలి అంజిరెడ్డి, ఉద్యమకారుడు గుండేటి ఐలయ్య, మాజీ సర్పంచ్ బొంగొని రాజయ్య గౌడ్, బీజేపీ నేత కర్ర సంజీవరెడ్డి, అలాగే కాంగ్రెస్ నాయకులు ఆకుల మహేందర్, అల్లం సతీష్, మాజీ ఎంపీటీసీ చొప్పరి రాజయ్య, తహసీల్దార్ యాకయ్య, ఏపీఎం లతమంగేశ్వరి మాజీ సర్పంచులు, ఎంపీటీసీలతోపాటు తదితరులు పాల్గొన్నారు.

● కాల్వశ్రీరాంపూర్ (ఆంధ్రజ్యోతి):రైస్‌మిల్లర్లు, కొనుగోలు సెంటర్ నిర్వాహకులు వడ్ల కట్టింగ్ పేరిట రైతులను ఇబ్బంది పెడితే ఊరుకునే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. శుక్రవారం మండలంలో పెగడపల్లి, కాల్వశ్రీరాంపూర్ గ్రామాల్లో ఐకేపీ సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు గాజనవేన సదయ్య, సింగిల్‌విండో చైర్మన్ చదువు రామచంద్రంరెడ్డి, వైస్‌చైర్మన్ సంధ్యావెంకటరెడ్డి, తహసిల్దార్ వకీల్, ఎంపీడీవో రామ్మోహన్‌చారి, ఏపీఎం కనకయ్య, సీఈవో శ్రీనివాస్, నాయకులు మనోహర్‌రావు, రమేష్, రాంచంద్రారెడ్డి, తిరుపతిరెడ్డి, మునీర్ తదితరులు పాల్గొన్నారు.


పెద్దాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పత్తికి దక్కని 'మద్దతు'

(5వ పేజీ తరువాయి)

ఈ ఏడాది జిల్లాలో పత్తి సాగు తగ్గుముఖం పట్టడంతో పాటు దిగుబడులు పడిపోతున్నాయి. దీంతో మద్దతు ధరలకు మించి ఎక్కువ ధర వస్తుందని రైతులు ఆశించినప్పటికీ, క్వింటాలుకు 7వేల రూపాయల ధర కూడా పలకడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తేమ శాతాన్ని పరిగణనలోకి తీసుకోకుండా సీసీఐ పత్తిని కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయమై పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రథమ శ్రేణి కార్యదర్శి పృథ్వీరాజ్ దేవరాజ్ మాట్లాడుతూ తేమ శాతం 20 శాతానికి పైగా ఉండడంతో వ్యాపారులు మద్దతు ధరలు పెట్టడం లేదని, సీసీఐ అధికారులు కూడా తేమ శాతాన్ని పరిశీలించారని తెలిపారు. 8నుంచి 12 శాతం తేమ ఉండే విధంగా పత్తిని ఆరబెట్టి తీసుకవస్తేనే మద్దతు ధరలు దక్కుతాయని ఆయన రైతులకు సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీల అందజేత

పాలకుర్తి,అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : మండలం పరిధిలోని జయ్యారం అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు శుక్రవారం పెద్దపల్లి బ్రాంచ్ క్రెడిట్ యాక్సిస్ ఇండియా ఫౌండేషన్ బ్యాంక్ వారు 20 చిన్న పిల్లల కుర్చీలు, 2 కార్పెట్లు, 4 పెద్ద కుర్చీలను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి వేణుగోపాల్ రావు, సీడీపీవో అలేఖ్య పటేల్, బ్యాంక్ ఏరియా మెనేజర్ ఆర్ చంద్రశేఖర్, సువర్ణ, అంగన్‌వాడీలు ఆవులం శోభారాణి, జంగిలి రజిత, ఆశా వర్కర్ వండ్లకొండ పద్మ, పంచాయతీ కార్యదర్శి పెండ్లి సాయిచరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి

పెద్దపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యల పరిష్కష్కారానికి కృషి చేస్తానని, ఇదే లక్ష్యంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నట్లు కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి, మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని పలు కళాశాలల అధ్యాపకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీచర్ ఎమ్మెల్సీగా గెలిపించి ఆశీర్వదిస్తే శాసన మండలిలో ఉపాధ్యాయ, అధ్యాపక, విద్యారంగ సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యతనిస్తానన్నారు. నవంబర్ 6లోపు ఓటును నమోదు చేసుకోవాలని కోరుతూ వివిధ కళాశాలల ఉపాధ్యాయ, అధ్యాపకులకు ఓటు నమోదు రిజిస్ట్రేషన్ పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాల్‌లు, ట్రస్మా జిల్లా, రాష్ట్ర బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

● కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గ పీఆర్‌టీయూటీఎస్ అధికార అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గండు కృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం మండలంలోని పెగడపల్లి, కునారం, మంగపేట, వెన్నంపల్లి, మొట్లపల్లి, మిర్జాంపేట, తారుపల్లి, మల్యాల, కాల్వశ్రీరాంపూర్ గ్రామాల్లో ఉన్న ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ మోడల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లో ఓటర్ నమోదు ఫారంలు అందశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూటీఎస్ కాల్వ శ్రీరాంపూర్ మండల అధ్యక్షులు ముంజాల హరికృష్ణగౌడ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కూరెళ్ల మల్లారెడ్డి, మండల బాధ్యులు గుండె కూచయ్య, మోతుక్కారి నారాయణ పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుకు స్పెషల్ డ్రైవ్

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 25: సభ్యత్వ నమోదుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు బీజేపీ నియోజకవర్గ ప్రవాసి గొట్టిముక్కుల సురేష్‌రెడ్డి తెలిపారు. రామగుండం నియోజకవర్గంలో 13వేల సభ్యత్వ నమోదు చేసినట్టు, జిల్లా వ్యాప్తంగా 38వేల సభ్యత్వాన్ని పూర్తి చేశామని బీజేపీ నియోజకవర్గ ప్రవాసి గొట్టిముక్కుల సురేష్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం మార్కండేయ కాలనీలోని బీజేపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడురోజుల పాటు స్పెషల్ డ్రైవ్ సభ్యత్వాన్ని పోలింగ్ బూత్ వారీగా నమోదు చేయనున్నట్టు, జిల్లాలో లక్ష సభ్యత్వ నమోదును లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. ఆరుముళ్ల పోషం, కందుల సంధ్యారాణి, క్యాతం వెంకటరమణ, కోడూరి రమేష్, గోపగోని నవీన్, మహవాది రామన్న, సుల్వ లక్ష్మీనర్సయ్య, గుండబోయిన లక్ష్మణ్‌యాదవ్, జక్కుల పద్మ పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులు చెల్లించి ప్రొసీడింగ్స్ తీసుకోవాలి..

అదనపు కలెక్టర్ అరుణశ్రీ

కోల్‌సిటీ, అక్టోబరు 25: రామగుండం నగరపాలక సంస్థలో ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకొని పరిశీలన పూర్తయిన వారు ఫీజులు చెల్లించి ప్రొసీడింగ్స్ తీసుకోవాలని కమిషనర్ అరుణశ్రీ పేర్కొన్నారు. శుక్రవారం ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు పరిశీలన పూర్తయిన పలువురికి ఆమె ప్రొసీడింగ్‌లు అందజేశారు. కార్పొరేషన్ పరిధిలో 7078 దరఖాస్తులు రాగా అందులో 2794 దరఖాస్తులకు స్థల పరిశీలన పూర్తయి ఫీజులు చెల్లించేందుకు ఆమోదం తెలిపారన్నారు. ఈ దరఖాస్తులకు ఫీజులు చెల్లించి రెగ్యులరైజ్ చేసుకోవాలని సూచించారు. ఏమైనా సందేహాలు ఉంటే నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగాన్ని సంప్రదించాలని ఆమె సూచించారు.

సకాలంలో పన్నులు చెల్లించండి

రామగుండం నగరపాలక సంస్థలో ఆస్తి పన్నులు సకాలంలో చెల్లించాలని కమిషనర్ అరుణశ్రీ ప్రజలను కోరారు. ఇంటి వద్దకు వచ్చే బిల్‌కలెక్టర్లకు చెల్లించాలని, కార్యాలయం కౌంటర్‌లో కూడా చెల్లించవచ్చన్నారు. మీ సేవా కేంద్రాలు, ఆన్‌లైన్‌లో కూడా చెల్లించే అవకాశం ఉందన్నారు. ఫోన్ నంబరుకు 9000253342కు సందేశం పంపి ఇంటి పన్ను వివరాలు తెలుసుకునే సౌలభ్యం కూడా ఉందని, ప్రజలు దీనిని ఉపయోగించుకోవాలన్నారు.


ప్రొసీడింగ్స్ అందజేస్తున్న కమిషనర్ అరుణశ్రీ

ఇటుక బట్టీల్లో కార్మికులకు తప్పని వేధింపులు

- ఒడిషా అధికారులకు ఫిర్యాదు - 15 మంది కార్మికులు స్వరాష్ట్రానికి

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి మండలంలోని ఇటుక బట్టీల్లో పని చేసేందుకు వచ్చిన కార్మికులను వేధిస్తున్నారంటూ ఒడిషా రాష్ట్ర అధికారులకు ఫిర్యాదు చేయడంతో జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. ఈసందర్భంగా కార్మికశాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా మండలంలోని రాఘవపూర్‌ని ఓ ఇటుక బట్టీలో పనిచేస్తున్న 13 మంది వలస కార్మికులు, ఇద్దరు చిన్నారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇటుక బట్టీలో పనిభారం ఎక్కువ అవుతోందని, యజమాన్యం ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని పేర్కొనగా వివరాలు నమోదు చేసి ఆర్డీవో గంగయ్యకు సమర్పించారు. దీంతో 13 మంది కార్మికులు, ఇద్దరు చిన్నారులకు రైలు ద్వారా ఒడిషా రాష్ట్రానికి పంపించారు. వెంట తహసీల్దార్ రాజ్‌కుమార్, కార్మిక శాఖ అధికారి హేమలత, ఆర్ఐ భానుతో పాటు , పోలీస్ శాఖ అధికారులు ఉన్నారు.


కార్మికులతో మాట్లాడుతున్న తహసీల్దార్

'విమర్శించే నైతిక హక్కు లేదు'

పాలకుర్తి,అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మంత్రి శ్రీధర్‌బాబును విమర్శించే నైతిక హక్కు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకు లేదని డీసీసీ ప్రధానకార్యదర్శి సూర సమ్మయ్య అన్నారు. శుక్రవారం బసంత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ఇసుక లారీలను హైదరాబాదుకు తరలించి అక్రమ దందాలతో కోట్లు గడించిన పుట్ట మధుకు మంత్రి శ్రీధర్‌బాబును విమర్శించే నైతిక హక్కు ఎక్కడిదన్నారు. సమావేశంలో బామ్లా నాయక్ తండా మాజీ సర్పంచ్ లాల్‌సింగ్, మాజీ ఉపసర్పంచ్ జ్యోతి శంకర్‌నాయక్, రాణాపూర్ మాజీ ఉపసర్పంచ్ కొమురెల్లిగౌడ్, వైస్‌ప్రెసిడెంట్ దండుగుల శ్రీకాంత్,బడుగు మహేందర్, కాదాసి నర్సయ్య, బొల్లు శేఖర్, వస్రం నాయక్, బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో గీత కార్మికులకు అన్యాయం

- ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ - గీత కార్మికులకు కాటమయ్య కిట్లు పంపిణీ

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ పాలనలో గీత కార్మికులకు అన్యాయం జరిగిందని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ అన్నారు. గీత కార్మికులకు శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాటమయ్య కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో గీత కార్మికులకు అన్యాయం జరిగిందని, తాటిచెట్లపై నుంచి పడి ఎంతో మంది గీత కార్మికులు మృతిచెందారని, 775మంది గీత కార్మికులు ప్రాణాలు కోల్పోగా, 2000మంది శాశ్వత అంగవైకల్యం పొందారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత గీత కార్మికులు తాటి చెట్లు ఎక్కే సమయంలో ప్రమాదాలకు గురి కాకుండా కాటమయ్య కిట్లను పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ మంగ, కాంగ్రెస్ నాయకులు బొంతల రాజేష్, మహంకాళి స్వామి, ముస్తాఫా, తిప్పారపు శ్రీనివాస్, పెండ్యాల మహేష్ పాల్గొన్నారు.


కాటమయ్య కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే

అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

సుల్తానాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలో చేపడుతున్న రోడ్డు వెడల్పు కార్యక్రమాలను ఎమ్మెల్యే విజయరమణారావు శుక్రవారం పరిశీలించారు. ఐబీ చౌరస్తా నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు పనులు పరిశీలించి అధికారులకు, మున్సిపల్ పాలకవర్గానికి పలు సలహాలు సూచనలు అందజేశారు. రెండు రోజులుగా ఈ రోడ్డులో దుకాణాల ముందు ఉన్న షెడ్లను ఇతర ఆక్రమణలను మున్సిపల్ సిబ్బంది పూర్తి తొలగించారు. రెండు మూడు రోజుల్లో కొత్త రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే రాజీవ్ రహదారి సుల్తానాబాద్ చెరువు నుంచి పాత జెండా చౌరస్తా, శివాలయం చౌరస్తా, హన్‌మాన్ టెంపుల్ వరకు రోడ్ల నిర్మాణం మొదలవుతుందని తెలిపారు. ఈ రోడ్డు పనులు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, మాజీ జడ్పీటీసీ మినుపాల ప్రకాష్‌రావు, మున్సిపల్ కమీషనర్, పలువురు కౌన్సిలర్లు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నేత్రాలు సజీవం

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : గోదావరిఖని మాతంగి కాలనీలో గురువారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మరణించిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వంశీ నేత్రాలను దానం చేయడానికి తల్లిదండ్రులు శ్రీనివాస్, మమత ముందుకు వచ్చారు. నేత్రాలను ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంకు సీనియర్ టెక్నీషియన్ సతీష్‌కుమార్ నేత్రాలను సేకరించి హైదరాబాద్‌కు తరలించారు. పుట్టెడు దుఃఖంలో ఉన్న తల్లిదండ్రులు నేత్రాలను దానం చేయడానికి ముందుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు కంజపురం రాజేందర్, కేఎస్ వాసు, మేజిక్ రాజా, చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

గాయత్రి విద్యానికేతన్‌లో ఆర్ట్ ఎగ్జిబిషన్


విద్యార్థులు గీసిన చిత్రాలతో కరస్పాండెంట్ శ్రీనివాస్

పెద్దపల్లి కల్చరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ చిత్రకళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్‌లో ఏర్పాటుచేసిన ఆర్ట్ ఎగ్జిబిషన్ ని గాయత్రి విద్యా సంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అల్లెంకి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరిలో ఏదో ఒక కళ అంతర్గతంగా దాగి ఉంటుందనీ, దానిని బాల్యంలోనే గుర్తించి, వారికి ఆయా కళల్లో శిక్షణ ఇప్పిస్తే భవిష్యత్‌లో గొప్ప పేరు సాధించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రజనీ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ విజయ్, రజియుద్దీన్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్సైకి సన్మానం

రామగిరి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నూతన ఎస్ఐగా పదవీ బాధ్యతలు స్వీకరించిన చంద్రకుమార్‌ను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసిన తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కన్వీనర్ గుండేటి ఐలయ్య ఆయన చాంబరులో సన్మానించారు. ఆయన వెంట నాయకులు కళాధర్‌రెడ్డి, బత్తుల శంకర్, నూనేరాజేశం, సదాశివ్, బొంకూరి పోచం తదితరులు పాల్గొన్నారు.

29న వాహనాల వేలం

మంథని, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తమ తనిఖీల్లో పట్టుపడ్డ పలు కేసుల్లోని వివిధ వాహ నాలను ఈనెల 29న ఉదయం 11గంటలకు స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో బహిరంగ వేలం వేయనున్నట్లు మంథని సీఐ రాజ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. వేలంపాటలో పాల్గొనడానికి ఆసక్తి ఉన్న వారు ఇతర వివరాల కోసం ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

ట్రేడ్స్ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం

కమాన్‌పూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ట్రేడ్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రకాష్‌రెడ్డిని శుక్రవారం మండల కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లోని కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గాండ్ల మోహన్, జిల్లా కార్యదర్శి రాజయ్య, యూత్ కాంగ్రెస్ మంథని నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ యూసుఫ్, కడారి మధునయ్య, బోనాల స్వామి, డైరెక్టర్ కొండ్ర సంతోష్‌లు ఉన్నారు.

క్వార్టర్ల తొలగింపు

గోదావరిఖని, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక మెయిన్ చౌరస్తాలో రోడ్డు వెడల్పు కార్యక్రమంలో భాగంగా సింగరేణి సంస్థకు చెందిన క్వార్టర్లను శుక్రవారం తొలగించారు. 70కిపైగా క్వార్టర్లను తొలగించాల్సి ఉంది. ఇప్పటికే పలు క్వార్టర్లను యాజమాన్యం ఖాళీ చేయించి కార్మిక కుటుంబాలకు మరోచోట క్వార్టర్లు ఇచ్చింది. శుక్రవారం మెయిన్ చౌరస్తాలోని ఒక క్వార్టర్‌ను సింగరేణి యాజమాన్యం కూల్చివేసింది. మరో రెండు మూడు రోజుల్లో క్వార్టర్లను తొలగించనున్నారు.



కార్మికుల సంక్షేమం మరిచిన గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు

- బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య


సమావేశంలో మాట్లాడుతున్న బీఎంఎస్ అధ్యక్షుడు సత్తయ్య

రామగిరి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికుల ఓట్లతో గెలిచిన గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు కార్మికుల సంక్షేమాన్ని విస్మరించాయని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య ఆరోపించారు. ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2లో శుక్రవారం నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కార్మికులకు కనీసం స్వచ్ఛమైన నీటిని అందించడం లేదన్నారు. కార్మికులకు రాపిడ్ గ్రావిటీ ఫిల్టరైజేషన్ ద్వారా తక్షణం శుద్ధనీటిని అందించాలన్నారు. కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్‌లో జరిగిన వెయ్యి కోట్ల కుంభకోణంపై సీబీఐతో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కలుషిత నీటి ద్వాకా కార్మికులు వారి కుటుంబాలు అనారోగ్యం చెందుతున్నారని విమర్శించారు. తాగు నీటి సమస్యపై గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నేతలను కార్మికులు నిలదీయాలని పిలుపునిచ్చారు. కార్మికుల సంబంధించిన పలు డిమాండ్లపై యాజమాన్యాన్ని ప్రశ్నించారు. ఈ సమావేశంలో ఏరియా ఉపాధ్యక్షుడు అరుకాల ప్రసాద్, నాయకులు రౌతు రమేశ్, మామిడి స్వామి, విద్యాసాగర్, జానీ మియా, మహేష్, శ్రీనివాస్, సంతోష్, రాయమల్లు, వెంకటసాయి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

రెస్క్యూ బ్రిగేడియర్ల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న రెస్క్యూ బ్రిగేడియర్లు

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి సంస్థలో 2003 సంవత్సరం నుంచి 2010 సంవత్సరం వరకు గని కార్మికులుగా, రెస్క్యూ సభ్యులుగా, బ్రిగేడియర్లుగా బాధ్యతలు నిర్వహించిన రెస్క్యూ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం కాలనీలోని రెస్క్యూ స్టేషన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ పొంది వివిధ రాష్ట్రాల్లో స్థిరపడిన అందరు పాల్గొని ఆనాటి గని ప్రమాదాల్లో సింగరేణి ఆస్తులను, తోటి కార్మికులను కాపాడిన జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. గని కార్మికులుగా పని చేస్తూనే అత్యంత కీలకమైన రెస్క్యూ బ్రిగేడియర్ విభాగంలో పని చేయడం వల్లనే తాము 70-80 ఏళ్ళు దాటిన ఇంకా ఆరోగ్యంగా ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉన్నామంటూ సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం రెస్క్యూ జీఎం శ్రీనివాస్‌రెడ్డి, రెస్క్యూ సూపరింటెండెంట్ మాధవరావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో చల్లా జక్కిరెడ్డి, కొత్త సత్యనారాయణ, ఆర్.రామకృష్ణ, కె.సత్యనారాయరెడ్డి, పి.సత్తయ్య, డి.దుర్గయ్య, నర్సింగరావు, బి.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీ-3లో కనీస వసతుల కల్పించాలని వినతి

రామగిరి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని సెంటినరీకాలనీ, పన్నూరులలో కనీస వసతులు ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. కాలనీలో రెండు రోజులకు ఒకసారి తాగునీటిని విడుదల చేస్తున్నారని, 20 నిమిషాలు మాత్రమే చేస్తున్నారన్నారు. ఎస్‌టీటూ క్వార్టర్లకు చాలా సంవత్సరాలు పెయింటింగ్ వేయించడం లేదని, దీపావళిలోపైనా పెయింటింగ్ పనులు చేపట్టాలని కోరారు. డ్రైనేజ్ బాటమ్ పూర్తిగా ధ్వంసం అయ్యిందని, మురుగు నీరు నిలవడంతో దుర్వాసన వస్తోందని పేర్కొన్నారు. కూలిన డ్రైనేజ్‌లను పునర్నిర్మాణం చేపట్టాలని వినతిపత్రంలో కోరారు.